హనీబీఎపి

సంపుటి 1, సంచిక 1

జులై-ఆగస్టు 2012

వెల : ₹ 25/-


# పల్లెసృజన

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org

## 4వ చిన్నశోధయాత్ర









# బాతులమధ్య హంసని గుర్తించటం



ఒక కొలను పక్కనున్న తోటలో ఒక బాతు కొన్ని గుడ్లు పెట్టింది. కొంత కాలానికి గుడ్లు పగిలి అందులోనుంచి చిన్న చిన్న బాతు పిల్లలు బైటకి వచ్చాయి. అందులో ఒక గుడ్డు కొంత పెద్దగా వుండి, దానిలోనుంచి ఒక పెద్ద బాతుపిల్ల బైటకి వచ్చింది. అప్పుడు బాతు దానితో నువ్వు నా అందరి పిల్లల్లాగా లేవు, వేరుగా వున్నావు. నువ్వు చాలా అసహ్యంగా వున్నావు అన్నది. ఆ బాతుపిల్లకి ప్రపంచంలోకి రాగానే ఇంత కఠినమైన స్వాగతం లభించటంతో బాధ కలిగింది. తన తోటి అన్నా చెల్లెళ్ల వంక చూసింది. అవి కూడా దీన్ని చూసి నవ్వి వెళ్ళిపో వెళ్ళిపో నువ్వు అసహ్యమైన బాతుపిల్లవి అని గేలి చేశాయి. తల్లిబాతు తన తతిమా పిల్లలను తీసుకొని కొలనులోకి ఈతకని వెళ్ళిపోయింది. దీనితో ఆడటానికి ఎవరూ రావటం లేదు. తమలో ఒకదానిగా అంగీకరించటం లేదు. ఇది కుందేళ్ళ దగ్గరికెళ్ళి అడిగింది. అవి కూడా నువ్వు వికృతంగా వున్న బాతుపిల్లవి నీతో ఆడుకోము అని చెప్పాయి. ఇలా ఎవరి దగ్గరికెళ్ళినా వాళ్ళు తమలో చేర్చుకోలేదు. అందరూ తమతమ గుంపులు, అందాలు చూసి గర్వపడుతున్నారే కాని, అంద వికారి అయిన బాతుపిల్లని ఎవ్వరూ చేరదీయలేదు. ఇది ఖిన్నురాలై ఎవ్వరూ లేని ప్రదేశానికి వెళ్ళి అక్కడో నీటి కొలనులో ఒంటరిగా ఈదుకుంటూ వెళ్ళిపోయింది.

సమయం మారింది. కొన్ని కాలాలు గడిచాయి. ఒకరోజు దగ్గరలో కొన్ని హంసలు ఎగురుకుంటూ వెళ్ళటం గమనించి నేనూ హంసలాగా అందంగా వుండివుంటే ఎంత బావుండేది అనుకుంది. ఇంతలో ఒక హంస బాతుదగ్గరకు వచ్చింది. ఇది కూడా తనని ఎగతాళి చేయటానికే వచ్చింది అనుకుంది బాతుపిల్ల. కానీ, వచ్చిన హంస మాతో వచ్చి మాలాగే ఎగురు అని ఆహ్వానించింది. బాతుపిల్ల నమ్మలేకపోయింది. నీటితో తన ప్రతిబింబాన్ని చూసుకుంది. అక్కడ దానికొక అందమైన తెల్లని హంస కనిపించింది. బాతు తన అనాకారి తనాన్ని ఎంత నమ్మింది అంటే తన ప్రతిబింబాన్ని కూడా ఇంతవరకూ చూసుకోలేదు. అందరూ తనని అనాకారి అన్నవాళ్ళే కాని, తన ఈకల మాటున అందమైన హంస రూపం ఉందని ఎవ్వరూ గుర్తించనీయలేదు.

**తమకేం చేతకాదని, జ్ఞానం అనేది తెలివైన వారి సొత్తు అనుకుని బాతు పిల్లల్లా భావించే హంసలాంటి ఇన్నోవేటర్లకి హనీబీ ఎప్పుడూ చేయూతనిచ్చి చేరదీసి సహాయ పడుతుంది.** – హనీబీ 8(1) 1997

# పల్లెసృజన

సంపుటి-1 సంచిక - 1 జులై-ఆగస్టు 2012


**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగులగణేశం

సంపాదకులు :
జె. శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీ జె. శ్రీకర్
శ్రీమతి అరుణ గణేశం

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
ఫోన్ : 040- 66105656
సెల్ : 93913 75655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555, 98660 01678
E-mail : honeybeeap@gmail.com
www.pallesrujana.org


## ఈ సంచికలో...


- నీటి పొదుపులో మిజోరం స్ఫూర్తి - 3
- గ్రామీణ శాస్త్రవేత్తలు ఐఐటి విద్యార్థులకు గురువులయ్యారు -7
- తేనెటీగల మిత్రుడు బస్ కండక్టర్ ప్రతిభన్ - 9
- మనందరికీ ఆదర్శం ఈ బామ్మ - 11
- ఆకుమచ్చ తెగులు నివారణకు సేంద్రియ మందు - 12
- కీటకాలను ఆకర్షించి మట్టుపెట్టే పరికరము - 13
- కొత్త పరికరాల సృష్టికి అవసరాలే మూలం - 14
- ఆదివాసి చిన్నారుల చిలిపి జ్ఞానం - 15
- 4వ చిన్నశోధయాత్ర - 18
- ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు - 25
- హనీబీఏపి ప్రగతి - 28
- ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి - 29
- స్పందన - 31


**కవర్ లోపలి పేజీల్లో....**

హనీబీ కథ

తెలుగువారి గుర్తింపు దృశ్యాలు

**మధ్య పేజీల్లో....**

ఢిల్లీలో మార్చి 2012లో రాష్ట్రపతి ద్వారా
జాతీయ అవార్డ్ పొందిన ఇన్నోవేషన్లు


## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed & Published by : **Brig. P. Ganesham,** 102, Vayupuri, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 32945655

Vol-1, Issue - 1 PALLE SRUJANA July-Aug 2012

# జ్ఞానం అందరి సొత్తు

జ్ఞానం భగవంతుడిచ్చిన వరం. దానికి రూపం, అస్తిత్వం లేదు. పంచడమేకాని, అనుభవించలేం. చర్చిస్తే, చూస్తే, ఆలోచిస్తే, విమర్శిస్తే, చదివితే, తిరిగితే జ్ఞానం పెరుగుతుంది. జ్ఞానాన్ని పదిమందితో పంచుకుంటే మరింత పెరుగుతుంది. మనిషి మనుగడకు జ్ఞానం అనివార్యం. సృష్టిలోని అన్ని జీవరాసుల్లో మనిషికున్న ప్రత్యేకత జ్ఞానం.

నాకు తెలిసినంతవరకు జ్ఞానం మన పూర్వీకులు అమ్మలేదు. అర్హులకు ఉచితంగా పంచారు. అలా తరతరాలుగా అర్హులైన వ్యక్తులకు పంచిన జ్ఞానమే వేద రూపంలో మనకు చేరింది. జ్ఞానార్జన, దాన్ని పంచడం కొందరి జీవిత లక్ష్యంగా ఉండేది. మన సాంప్రదాయంలో జ్ఞానం ఏ మూలనుండి, ఏ కులం నుండి, ఏ వర్ణం నుండి వచ్చిన మన సమాజం దాన్ని ఆహ్వానించింది. ఆస్వాదించింది. జ్ఞానపరంపరను కొనసాగించింది. అందుకే మన దగ్గర సుభాషితాలు, కబీర్ కథలు, వేమన పద్యాలు, అన్ని కులాల వాళ్ళు రచించిన రామాయణాలు, నీతులు ...... ఇలా ఎన్నో జ్ఞాన సంపదలు మనకు వారసత్వంగా లభించాయి.

అయితే వర్తమానంలో జ్ఞానాన్ని అమ్మే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. 'పేటెంటు' వ్యవస్థను దీనికై ప్రపంచ దేశాలు రూపొందించాయి. పేటెంటు పొందడం వల్ల వ్యవస్థనుండి గుర్తింపు వస్తుంది. ప్రతి పేటెంటునూ వ్యాపార రీత్యా మార్కెట్‌లో పెట్టి లాభాలు పొందడం సాధ్యం కాదేమో. అలాంటప్పుడు పేటెంటైన జ్ఞానం అలాగే ఉండిపోవచ్చు, సమాజానికి చేరకపోవచ్చు. నిష్పక్షపాతంగా ఆలోచిస్తే పేటెంటు వ్యవస్థ సమాజంలో జ్ఞానకర్తలను ప్రోత్సహించి మరిన్ని ఆలోచనలను వ్యవస్థీకరణ చేసి సమాజానికి ఉపయోగ పడాలని ఆశిస్తుంది. కాని పేటెంటుల ద్వారా లాభాలు చేసుకోవాలనే వ్యక్తుల జ్ఞానం సమాజానికి చేకూరుతుందో లేదోనన్నది అనిశ్చితమే. ఎందుకంటే ప్రతి జ్ఞానం మార్కెట్‌లో విజయవంతం కాకపోవచ్చు, దీనివల్ల ఎంతో జ్ఞానం సమాజానికి అందుబాటులో ఉండదు.

భారతదేశం లాంటి ప్రాచీన నాగరికత, సాంప్రదాయ చరిత్ర వున్న దేశంలో పేటెంటు వ్యవస్థలో ఎంతో జ్ఞానాన్ని కోల్పోయే అవకాశం వుంది. లాభాపేక్ష లేకుండా జ్ఞానసంపదను పంచే వ్యక్తులున్నంతవరకు సమాజానికి జ్ఞానం అందుతూనే వుంటుంది. కాని జ్ఞానాన్ని వ్యాపారంగా చేయడానికి మనదేశంలో ముమ్మరంగా, కోకొల్లలుగా కన్సల్టింగ్ ఏజెన్సీలు పుట్టుకొస్తున్నాయి. ఈ సంస్థలు తమ లాభాలకై ప్రజలవద్ద పేటెంటు పొందడానికి అత్యధిక ఫీజులు తీసుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని జ్ఞానకర్తలు, మధ్యతరగతి ఇన్నోవేటర్లు, విద్యార్థులు ఈ ధన భారాన్ని మోయలేక ఏం చేయాలో తెలియక అయోమయంలో పడుతున్నారు. నిజానికి 25 వేల రూపాయల్లో పేటెంటు సులభంగా లభిస్తుంది. ప్రభుత్వ రుసుము రూ. 5 వేలు మాత్రమే. కానీ జ్ఞానాన్ని ప్రత్యేక రీతిలో వ్రాసి పేటెంటు సంస్థకు అందజేయడం, ఆ తర్వాత అవసరమైన సాంకేతిక వివరాలను పంపడం, ప్రతి సంవత్సరం పేటెంటును కొనసాగించడం లాంటి వాటికి కన్సల్టెంటు ఫీజు తీసుకుంటారు. అవన్నీ కలిస్తే 25 వేల వరకు ఉంటుంది. ఇవన్నీ మనమే చేసుకుంటే 'ఆన్‌లైన్'లో అప్లికేషన్ ఫైల్ చేస్తే ఖర్చు చాలా తగ్గుతుంది.

'పల్లెసృజన' గ్రామీణ ఇన్నోవేటర్లకు వారి జ్ఞానాన్ని పేటెంటు చేయటానికి సహాయం చేస్తుంది. ఏది ఎలా పేటెంటు చేయాలో సలహానిస్తుంది. గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్లు ఈ విషయంలో మమ్మల్ని సంప్రదించగలరు.

గత సంచికలో (32వ పేజీ చూడండి) సూర్యకాంతితో ఒక జిరాక్స్ దుకాణం ఎంత విజయవంతంగా నడుస్తుందో తెలియజేశాము శివకుమార్ చేసిన ప్రయత్నం, ఇన్నోవేటర్ రామచంద్రయ్య జ్ఞానం ప్రశంసనీయం. ఎంతోమంది ఈ సూర్యరశ్మి ద్వారా విద్యుత్తును తమ నివాసాల్లో, ఆఫీసుల్లో, దుకాణాల్లో ఏర్పాటు చేసుకుని ఆర్థిక లాభాలు పొందుతారని ఆశిస్తున్నాం. దీనికై మమ్మల్ని ఎప్పుడైనా సంప్రదించవచ్చు. సూర్య భగవానుడితో డైరెక్టు సంబంధం పెట్టుకుని ఆయన ఆశీస్సులను నిరంతరం 'పల్లెసృజన' పాఠకులు పొందుతారని ఆశిస్తున్నాము.



భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**దూరదర్శన్, హైదరాబాద్ ప్రతినెల 4వ గురువారం రాత్రి 8 గంటలకు సప్తగిరి ఛానల్ లో 'సృజన' కార్యక్రమం ద్వారా గ్రామీణ శాస్త్రవేత్తలను పరిచయం చేస్తారు. పాఠకులంతా ఈ కార్యక్రమాన్ని తప్పకుండా చూసి మీ అభిప్రాయాలను మాకు తెలియజేయగలరు.**

# 28వ శోధయాత్ర - మిజోరం

జనవరి 9 - 14, 2012
అజీజ్‌వాల్ జిల్లాలో
సహిలాం నుండి
మేల్ రైట్ వరకు

# నీటి పొదుపులో మిజోరం స్ఫూర్తి



**మిజోరంలో మేము నిర్వహించిన 28వ శోధయాత్రలో వ్యక్తిగతంగా నాకెన్నో సమాధానాలు లభించాయి. ప్రతిరోజూ మన దినచర్యలో నీటిని పొదుపుగా వాడాలని నాకు తెలుసు. కానీ నేను ఉదయం సబ్బుతో చేతులు కడుక్కునేటపుడు నల్లాలో నీళ్ళు వృధాగానే పోతూ వుంటాయి. ఈ నిజం మీకు చెప్పాలి. ఇప్పుడలా చేయటానికి నా మనసు ఒప్పటం లేదు. నా ఆలోచనల్లో ఇంత మార్పు తెచ్చిన ఆ అనుభవాలను మీతో పంచుకోవాలనుకుంటున్నాను. నా తప్పును సరిదిద్దుకొన్న వైనం మీకు తెలియజేస్తాను. - అనిల్ గుప్త.**

జనవరి 2వ వారం మిజోరం లోని సైలాం నుండి మేల్‌రైట్ వరకు మా శోధయాత్రలో భాగంగా నడుస్తున్నపుడు మేము నీటిని పొదుపు చేయటంలో అసాధారణ స్ఫూర్తి గమనించాం. చిన్నచిన్న గ్రామాలలో కూడా ప్రతి ఇంటి కప్పుపైన నీటిని పొదుపు చేసే సదుపాయాలున్నాయి. వీధులు శుభ్రంగా ఉన్నాయి. ప్రతి 50 నుండి 100 మీ. దూరంలో చెత్త పోసేందుకు కుండీలున్నాయి. సాయంత్రం పూట కూడా మాకు ఎక్కడా రోడ్లపైన చెత్త కనిపించలేదు. మురికి కాలువలు శుభ్రంగా ఉన్నాయి. ప్రతి వీధి మలుపులోనూ స్త్రీలకి, పురుషులకి మూత్రశాలలున్నాయి. మనం మన గ్రామాలలో ఇటువంటి మూత్రశాలలు ఎప్పుడు చూశాం. ఉత్తర ప్రదేశ్‌లో నా స్వంత గ్రామంలో కూడా ఇటువంటి సదుపాయం లేదు. గత 15 సంవత్సరాలలో కొన్ని వేల మైళ్ళు నడిచినా చిన్న చిన్న గ్రామాల్లో కూడా ఇక్కడున్నంత సామూహిక క్రమశిక్షణ ఎక్కడా చూడలేదు. ఇంతే కాక ఈ ప్రాంతంలో మేము చూసిన పెద్ద గ్రామాలు, పట్టణాలు కూడా ఈ విధంగానే ఉన్నాయి.





ఈ శుచి, శుభ్రతలను చూస్తూ దాన్ని ఆచరించేవారి స్ఫూర్తిని మెచ్చుకుంటూ వెళుతూ వుంటే మాకొక విచిత్రమైన దృశ్యం కనిపించింది. అక్కడొక నల్లాలోనుండి చుక్క చుక్కగా నీళ్ళు కారుతూ ఉన్నాయి. ఇలా నల్లాల నుండి నీరు కారడం ఆ క్రింద ఒక చిన్న మడుగులాగా ఏర్పడటం మనం చాలాసార్లు చూసేవుంటాం. కానీ ఇక్కడ ఆ కారుతున్న నీరు వృధా కాకుండా ఒక డబ్బాలో పడేవిధంగా ఒక రేకుతో తూములా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో నీరు ఎక్కడా వృధా అవటం చూడలేదు. అది చూసి మా శోధయాత్రీకులు చాలా ప్రభావితమయ్యారు. ఏప్రాంతంలోనైనా మనుషులు నీటి వాడకంలో ఇంత పొదుపుగా, పిసినారుల్లా ఉంటారా అనిపించింది.

పక్క గ్రామంలో మాలో ఒకరు ఉదయంపూట మూలికా ఔషధం వేసుకోవటానికి ఒక కప్పుతో నల్లాదగ్గరికి వెళ్ళారు. అక్కడ అప్పుడే పంటల దగ్గర స్వచ్ఛందంగా సేవచేయటానికి వచ్చినవారు ఒక బకెట్లో నీళ్ళు నింపుతున్నారు. వారు కప్పుతో వచ్చిన ఇతన్ని చూడగానే నల్లా మూసేసి బకెట్ పక్కకి జరిపి, ఇతని కప్పు తీసుకొని నల్లా తెరిచి కప్పునింపి మళ్ళా నల్లా మూసేసి కప్పు ఇతనికి ఇచ్చి బకెట్‌ను నల్లాక్రిందికి మార్చి తర్వాత మళ్ళీ నల్లా తెరిచారు. ఆ కప్పుతో వెళ్ళిన వ్యక్తి తానే ఆ పరిస్థితుల్లో వుంటే ఏం చేసేవాడిని అని ఆత్మవిమర్శ చేసుకున్నాడు. తానైతే నీళ్ళు పడుతున్నపుడే బకెట్ పక్కకి జరిపి, కప్పులో నీళ్ళు నింపి తిరిగి బకెట్‌ని నల్లాకిందికి నెట్టేవాడిని. ఈ క్రమంలో కొంత నీరు వృధా అయ్యేది. నేను దీన్ని పట్టించుకునేవాడ్నే కాదు. ఇది చూశాక నాకు తప్పకుండా పట్టించుకోవాలనిపించింది. ఇకపై నీటిని వృధా చేయకూడదని నిర్ణయించుకున్నాను.

మనలో చాలామందికి మనం నీటిని వృధా చేస్తున్నామన్న విషయం తెలుసు. బాధాకరమైన విషయం ఏమిటంటే ఆ విషయం తెలిసిన వారికి కూడా కొన్ని అలవాట్లుంటాయి. నీటిని పొదుపుగా ఎలా వాడాలన్న నిబంధనలు సమాజంలో ఏమీలేవు. మన అలవాట్లతోనే దానిని సాధించాలి. దీనిని గురించి మనమేమన్నా చేయగలమా? ఆలోచించండి.

ఇక్కడ మనం ఇంతకుముందు చాలాసార్లు చెప్పుకొన్న "బౌద్ధ కథ"ను గుర్తు చేసుకుందాం. సుమారు 2000 సంవత్సరాల క్రితం ఒక గురువుగారు తన శిష్యున్ని పిలిచి త్రాగడానికి ఒక గ్లాసుతో నీళ్ళు తీసుకురమ్మని పురమాయించాడు. శిష్యుడు వినమ్రంగా నీళ్ళు తెచ్చాడు. గురువుగారు నీళ్ళు త్రాగి ఆ గ్లాసు శిష్యుడికి ఇచ్చి దానిని జాగ్రత్తగా వంటింట్లో పెట్టి రమ్మని చెప్పాడు. శిష్యుడు అదేవిధంగా చేసి తిరిగి వచ్చాడు. గురువుగారు శిష్యుడితో నువ్వు చేసిన పని వివరంగా చెప్పు" అన్నాడు. శిష్యుడు గురువుగారు నీళ్లకని పిలవటం మొదలుకొని తాను వంటింట్లోకి వెళ్లి గ్లాసుతో నీళ్ళు తేవటం, గురువుగారు నీళ్ళు త్రాగాక తిరిగి గ్లాసును వంటింట్లో పెట్టటం వరకు అన్నీ





చెప్పాడు. గురువుగారికి తృప్తి కలగలేదు. మళ్ళీ బాగా గుర్తు చేసుకొని చెప్పు అన్నాడు. పాపం శిష్యుడు తాను చేసిందంతా వివరంగా చెప్పాడు. గురువుగారు కొంచెం కోపంగా ఏం చేశావో బాగా గుర్తు చేసుకొని వివరంగా చెప్పు అన్నాడు. అప్పుడు గుర్తుకొచ్చిందా శిష్యునికి తాను ఖాళీ గ్లాసు వంటింట్లో పెట్టడానికి వెళ్ళినపుడు అందులోవున్న ఒక్క నీటి చుక్కను పారబోశాడు. అదే చెప్పాడు గురువుగారికి. ఈ విషయం గురువుగారికి చెపుతూ ఒక్క చుక్క అని చెపుతూ వుండగా అతనికి జ్ఞానోదయమైందట.

గౌతమ బుద్ధుడి కథని ఏ నీటియెద్దడీ లేని కనీసం 1500 నుండి 2000 సంవత్సరాల వరకు నీటికై ఏ సమస్యలూ ఊహించని కాలంలో ఎందుకు చెప్పారు? విజ్ఞులైన గురువులు చాలా దూరం ఆలోచిస్తారు. ఈ కథ మన జన్యులలో జీర్ణించుకొని పోయి మనందరికీ వారసత్వంగా ఎందుకు లభించలేదు.

మిజోరం దీనిని ఎలా సాధిస్తోంది. 1971లో అక్కడ తిరుగుబాటు ఉద్యమం పూర్తయిన తర్వాత అప్పుడున్న ముఖ్యమంత్రి మిజోరం నేషనల్ ఫ్రంట్ నాయకుడికి తన పదవిని ఇచ్చేయాల్సి వచ్చింది. చాలా గ్రామాలు రోడ్డుప్రక్కనే



అయినా ఎత్తయిన పర్వత ప్రాంతంలోకి మారాల్సి వచ్చింది. 30 - 40 సంవత్సరాల కాలంలో గ్రామస్తులు నీరు పుష్కలంగా ఉండే ప్రాంతాల నుండి నీరు ఎక్కువ లేని ఈ ప్రాంతాల్లోకి వలస వచ్చారు. పిల్లలకి, పెద్దలకి కూడా నీటిని పొదుపు చేసే సంస్కృతి ఎవ్వరూ చెప్పనవసరం లేకుండానే వంటబట్టింది, అలవాటుగా మారిపోయింది. నీరు వృథా చేసే వారికి శిక్షిస్తామని, ఎక్కడా గోడలమీద వ్రాతలు, సైన్ బోర్డులు, నినాదాలు కనిపించవు. అయినా నిశ్శబ్దంగా వారాపని ఎవరూ చెప్పకుండానే స్వతహాగానే చేసుకు పోతున్నారు.

నీటిని పొదుపు చేసే విషయంలో మిజోరం ను మనం భారత రాజదానిగా చేయవచ్చునేమో. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌ల నుండి ప్రజలు ఈ గ్రామాలకు వచ్చి స్ఫూర్తి చెందలేరా? నాయకులు, పెద్దలు వినిపించుకోక పోతే పిల్లలన్నా ఈ విలువను పెంపొందిస్తూ పరంపరాగతంగా వస్తున్న అలవాట్లను, ఆలోచనలను ఛేదించి మార్చలేరా? మన నీటివనరుల మంత్రిత్వ శాఖ పారిశుధ్యం, నీటి రక్షణలపై జరిపే సదస్సులు ఏ సైలాం లోనో, చంపాయ్ లోనో ఏర్పాటు చేయకూడదా? ఎందుకు చేయకూడదు. ఏ రంగంలోనైనా మంచిని, పేరు ప్రఖ్యాతులని సాధించిన ప్రాంతంలో దానికి సంబంధించిన కార్యాలయాలు అక్కడ స్థాపించక, ఏ ఢిల్లీ, ముంబాయి, కలకత్తాలలో ఎందుకు ఉండాలి? నినాదాలు నీటిని పొదుపు చేయలేవు. కానీ కార్యోన్ముఖులైన వారు వేసే చిన్న చిన్న అడుగులు, రోజూ చేసే చిన్న చిన్న పనులు అంతరంగంలో దాచుకున్న ఉత్తమమైన విలువలకు అద్దంలా కనపడతాయి. ఎప్పుడైతే అందరూ తమతమ అంతరంగాల్లోనుంచి ఈ సందేశం వింటారో, సమాజంలో మార్పు అన్నది దానంతట అదే వచ్చేస్తుంది. అంతరంగ నినాదం వ్యక్తులకు, సమాజానికి చాలా బలమైన స్ఫూర్తిని కలగజేస్తుంది. దీనికి మిజోరం ఏమన్నా సహాయం చేస్తుందా?

●



# గ్రామీణ శాస్త్రవేత్తలు ఐఐటి విద్యార్థులకు గురువులయ్యారు!

జమ్మలమడక శ్రీకర్



జ్ఞానం ఒకరి సొత్తుకాదు. దానికి గొప్ప, బీద తారతమ్యాలు లేవు. చదువుకు, జ్ఞానానికి సంబంధం వుండాల్సిన అవసరం లేదు. గొప్ప చదువులు చదివిన వారు కూడా ఆ చదువుని వాడకపోతే అది జ్ఞానులు అనిపించుకోరు. ఇలా మనం జ్ఞానాన్ని గురించి ఎంతైనా వ్రాసుకుంటూ పోవచ్చు. మొన్నీమధ్య ఐఐటి ఖరగ్‌పూర్ నుండి వచ్చిన విద్యార్థులు 'పల్లెసృజన' ఆధ్వర్యంలో పల్లె శాస్త్రజ్ఞుల మార్గదర్శంలో వారు తెలుసుకున్న సత్యాన్ని ఎన్.ఐ.ఆర్.డి. లోని రూరల్ టెక్నాలజీ పార్క్ లో జరిగిన సమావేశంలో వివరించి చెప్పారు. అంతేకాదు వారు సముపార్జించిన జ్ఞానాన్ని ప్రసాదించిన మేధావులను స్వయంగా సన్మానించారు.

జ్ఞానం ఒకప్పుడు పంచబడింది, ఆ రోజుల్లో జ్ఞాన దాతలు వారి జ్ఞానాన్ని వెలకట్టలేదు. అలా చేసివుంటే బహుశా మనమీనాడు అంధకారంలో కొట్టుమిట్టాడుతూ వుండేవాళ్ళం. జ్ఞానభోక్తలు వారు ఆస్వాదించ వీలున్న జ్ఞానాన్ని ఆస్వాదించారు, జీర్ణించుకోదగినంత జీర్ణించు కున్నారు. ఎవరి తాహతుకు తగ్గట్లు వారు లాభం పొందారు. ఇక్కడ 'తాహతు' అంటే జీర్ణించుకునే తాహతే కాని, ధనంతో పొందే తాహతు కాదన్న విషయం మనం తెలుసుకోవాలి.

పిల్లలకు సరైన దారి చూపేది మొదటిగా వారి తల్లిదండ్రులు. వారు తన సంతానం ఒక మంచి పేరును సంపాదించాలని కోరుకోవడం స్వార్థం కాదు. కానీ, ఎలాగైనా తన సంతానం డబ్బునార్జించాలని అనుకుంటే అది స్వార్థమే కాదు, అనర్థం కూడా. అటువంటి స్థితిలోనే నేడు మనందరం వున్నాం. 'ఎలాగైనా' అన్న మాటకు ఆంగ్లంలో 'బై హుక్ ఆర్ బై క్రూక్' అనే నిర్వచనం వర్తిస్తుందేమో. కొనుక్కోవడానికి 'ప్రాజెక్ట్ రిపోర్టు'లు, 'అసైన్‌మెంట్'లు, మార్కులు, అమ్ముకునే ప్రభుద్దులు ఉన్నంతవరకు 'ఎలాగైనా' అన్న మాటకు చావుండదు.

వీటికి భిన్నంగా కొందరు ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థులు 'నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ & రీసర్చ్ మేనేజ్‌మెంట్' ఆధ్వర్యంలో 'పల్లెసృజన' సహాయంతో పట్టణాలలోని సౌఖ్యాలను ఒకింత పక్కన పెట్టి బ్రిగేడియర్ గణేశం, డా. కల్పనా శాస్త్రి గార్ల ఉద్భోదలను విని, గ్రామ స్థాయిలోని అట్టడుగు మేధావులు చేసిన చిన్న చిన్న ఆవిష్కరణలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, తిరిగి వచ్చి మేధావుల సమక్షంలో తాము సముపార్జించిన జ్ఞానాన్ని తెలిపి, విజ్ఞాన దాతలకు సన్మానం చేయటం, ఈ సమకాలీన ధనమూల వింత ప్రపంచంలో నిజంగా విశేషం. వారిని ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులు ప్రశంసార్హులు. వారు ప్రాజెక్టు రిపోర్టులను ఈవిధంగా తయారు చేయడం ఒక వినూత్న ప్రయోగంగా భావించవచ్చు.

రాబోయే సంవత్సరాలలో ఇటువంటి జ్ఞాన దాహం చాలామంది విద్యార్థులకు కలగాలని 'పల్లెసృజన' ఆశిస్తోంది. అలాగే దాహార్తి తీర్చడానికి ఇంకా ఎందరో అట్టడుగు జ్ఞాన సంపన్నులు 'పల్లెసృజన'కు తెలియాలని, వారి కృషి నలుమూలలా వ్యాపించాలని, అందుకోసం 'పల్లెసృజన' వారి



ఇతోధికంగా సహాయపడుతుందని తెలియజేస్తున్నాము.

ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థులు 'పల్లెసృజన' సౌజన్యంతో గ్రామీణ స్థాయిలోని ఇన్నోవేటర్లని కొందరిని కలిసి, వారు ఆ ఇన్నోవేషన్లు చేయటానికి ప్రోద్బలం, పరిస్థితులు, ఇన్నోవేషన్‌లో ఎదుర్కొన్న కష్టాలు మొదలైన వాటిని గురించి తెలుసుకొని ఆ అనుభవాలని హైదరాబాద్ లోని ఎన్.ఐ.ఆర్.డి. లోగల టెక్నో పార్క్‌లో 11 జులై, 2012 నాడు జరిగిన ఒక సమావేశంలో వివరించటం జరిగింది. జ్ఞాన దాతలు గోదాసు నర్శింహ, సయ్యద్ సుభాని, తొండపి గురవయ్య, చింతకింది మల్లేశంల కృషిని వారు చేసిన నిస్వార్థ కృషికి ధన్యవాదాలు. వారి కృషిని తమదైన శైలిలో, తమ భాషలో వివరించిన అందరినీ ఆకట్టుకున్న అపరంజిత, ప్రసాద్, కిషోర్, స్వరూప్, ధీరజ్‌ల ప్రయత్నం అమోఘం. వారికి దారి చూపిన పల్లెసృజన బృందానికి అడుగడుగునా తోడ్పడ్డ కల్పన గారికి, ఓపికగా విన్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు.

ఈ సమావేశంలో ఎన్.ఐ.ఆర్.డి. ఆర్.టి.పి. డైరెక్టర్ శ్రీ జె.ఎ.సి.ఎస్. రావు ప్రారంభోపన్యాసం చేస్తూ "ఇది 'నారమ్', పల్లెసృజన కలిసి గ్రామీణ స్థాయిలోని ఇన్నోవేటర్లు, వారి ఇన్నోవేషన్లు ఐఐటి స్థాయిలో కూడా ప్రేరణ కలిగించటానికి ఈ ప్రయత్నం చేయబడింది" అని చెప్పారు. రాజేంద్రనగర్ లోని నారమ్ ప్రధాన శాస్త్రవేత్త డా. కల్పనా శాస్త్రి గారు సమావేశ పూర్వాపరాలు, నారమ్ మరియు పల్లెసృజన చేస్తున్న ఈ ప్రయత్నం గురించి వివరించారు. తర్వాత ఐఐటి విద్యార్థులు టి.యన్.డి.వి. ప్రసాద్, ఎ. కిషోర్, అపరంజితా రెడ్డి, స్వరూప్ రెడ్డి, ధీరజ్ రెడ్డి మొదలైన వారు ఇన్నోవేటర్ల దగ్గర వారు గడిపిన సమయము, వారి అనుభవాలు చాలా చక్కగా వివరించారు. మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ శ్రీ శ్రీనివాస శాస్త్రి గారు ఓపిగ్గా కార్యక్రమంలో పాల్గొని ఇలాంటి సంధానాలు విస్తారంగా జరిగితే విద్యార్థులకు సమాజంపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు.

జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాల, కర్నూలు నుంచి విచ్చేసిన 30 మంది విద్యార్థులు, వారి ప్రొఫెసర్లు ఈ కార్యక్రమం తమకెంతో స్ఫూర్తినిచ్చిందని అన్నారు.

సమావేశం చివరలో ఇన్నోవేటర్లయిన గోదాసు నర్శింహ, సి.హెచ్. సుభాని, తొండపి గురవయ్య, చింతకింది మల్లేశంలను ఐఐటి విద్యార్థులు సత్కరించి ప్రాజెక్టు రిపోర్టులను వారికి సమర్పించారు.



# తేనెటీగల మిత్రుడు బస్ కండక్టర్ ప్రతిభన్

## తేనెటీగలను పెంచి అదనపు ఆదాయం పొందటం కొత్తరకంవ్యాపారం



'ద హిందూ' ఆంగ్ల దినపత్రికలో యం.జె. ప్రభు వ్యాసం ఆధారంగా

తమతమ ఉద్యోగాలు చేసుకుంటూనే తాము నమ్మినదానిని, కోరుకున్న దానిని సాధించేవారిని అరుదుగా చూస్తూవుంటాము.

తమిళనాడులోని గోపిచెట్టి పాల్యంకు చెందిన 'ఎ. ప్రతిభన్' అటువంటి వ్యక్తులలో ఒకరు. ఈయనని అక్కడి ప్రజలు తేనెటీగల మనిషి అని పిలుస్తూవుంటారు. ఈయన గోబి – మధురై మార్గంలో రోజుకి 12 గంటలు, వారానికి మూడురోజులు బస్సు కండక్టరుగా పనిచేస్తూ వుంటారు. మిగతా సమయాల్లో ఈయన తేనెటీగలను పట్టటము, వాటిని ప్రత్యేకమైన డబ్బాలలో ఉంచటం, ఆ డబ్బాలని పొలాలలో, పూల తోటలలో లేదా కొబ్బరి తోటల్లో ఉంచుతూ వుంటారు.

సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన ప్రతిభన్ ప్రకృతిలోని సమతుల్యాన్ని, దాని ప్రాముఖ్యతని బాగా అర్థం చేసుకున్న వ్యక్తి. అందరికీ ఆహారాన్ని అందించాలి అనే మన కృషిలో క్రిమి కీటకాల అవసరం ఎంతైనా వుంది. అవి లేకపోతే మనకి పూలు, పళ్ళు, కూరగాయలు దొరకవు–అంతరించిపోతాయి అంటాడు ఆయన. కానీ మనం ఆధునిక టెక్నాలజీ పేరుతో మనకెంతో సహాయం చేసే క్రిమి కీటకాదులని నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నాము. వాటిలో అతి ముఖ్యమైనవి 'తేనెటీగలు'. అవి మన చేష్టల వలన అంతరించిపోయే ప్రమాదం వుంది.

పాశ్చాత్య దేశాలలో వారు పుష్పాలలో పరంపరాగ సంపర్కం కల్పించే ఈ తేనెటీగల ప్రాముఖ్యతని గుర్తించి, వాటిని రక్షించేందుకు, వృద్ధి చేసేందుకు అనేక చర్యలు చేపడుతున్నారు. కానీ మనం వాటిని ఒక చికాకుగా భావించి, పొగ పెట్టి, లేదా మంట పెట్టి, వాటిని తరిమి వేస్తున్నాం లేదా చంపివేస్తున్నాం అంటారాయన.

మొదట్లో స్నేహితులు, తెలిసిన వారు ఇతన్నొక పిచ్చివాడిగా అనుకున్నా, అతను చేస్తున్న పనిని గుర్తించి, తను చెప్పిన మాటలను విని ఇతనిని గౌరవించడం ప్రారంభించారు. ఇప్పుడితనికి వేర్వేరు ప్రాంతాలనుండి తమ ప్రాంతంలో తేనెటీగల డబ్బాలు ఏర్పాటు చేయమని, తమ తోటల్లో గోడౌన్లలో తేనెటీగలను పట్టుకోమని ఆహ్వానాలు



అందుతూ వుంటాయి.

ప్రజలకి తేనెటీగలంటే భయం, అవి కుడతాయని బెదిరిపోతూ వుంటారు. నిజానికి సాధారణంగా అవి వాటిజోలికి వస్తే తప్ప కుట్టవు. ఇతనికి ఆ ప్రాంతంలో పలుకుబడి పెరగటానికి ముఖ్య కారణం ఈయన తేనెటీగల డబ్బాలు ఏర్పాటు చేయటమే కాక, వాటి ఆలనా పాలనా కూడా తానే చూసుకుంటాడు. తేనెటీగల పెంపకం గురించి చాలామందికి తెలియదు. ఎవరూ ముందుకు రారు. అటువంటి సందర్భంలో నేను వారికి సహాయం చేస్తానని, అన్నీ నేనే చూసుకుంటానని అనటం వారికెంతో నచ్చింది. అందుకే వారి తోటల్లో, పొలాల్లో డబ్బాలు పెట్టించుకోవటానికి ముందుకు వచ్చారని చెబుతారాయన.

దీనికాయన రెండు పద్ధతులు ఉపయోగిస్తూ వుంటారు. రైతు ఖర్చుతో అతడి పొలంలో డబ్బాలు ఏర్పాటు చేసి ఆ తేనె అమ్మగా వచ్చిన డబ్బును రైతుకే అందజేయడం ఒకటి, రెండవది పార్దీబన్ తానే స్వంతంగా రైతుల పొలాల్లో తేనెటీగల డబ్బాలు ఏర్పాటు చేసి, ఆ తేనె అమ్మగా వచ్చిన డబ్బులో రైతుకు సగం ఇవ్వడం.

ఒకసారి 'కొలపలూరు' ప్రాంతంలోని 'వైకూరు తొట్టం' గ్రామానికి చెందిన కె.కె. రామస్వామి అనే అతను తన చింతతోపులో దిగుబడి విషయంలో ఈయనని సలహా అడిగారు. దానికి పార్టీబన్ ఆ చెట్ల ప్రాంతంలో కొన్ని తేనెటీగ డబ్బాలు ఏర్పాటు చేసి, కొన్ని నెలలు ఓపిక పట్టమన్నాడు. ఆ తర్వాత రామస్వామికి వున్న 250 చింత చెట్లలో సాధారణంగా వచ్చే 1000 కిలోల దిగుబడికన్నా ఎక్కువగా 4,350 కిలోల చింతపండు దిగుబడి వచ్చింది.

పార్టీబన్‌కి వచ్చే నెలసరి ఆదాయంతో పాటు ఈ తేనెటీగల వలన దాదాపు రూ. 2000 వరకు అదనపు ఆదాయం వస్తోంది. తేనెటీగలని చెట్లెక్కి పట్టుకోవటము, అవి అడపా దడపా తనని కుట్టటము మామూలే అయినా తాను ఏదో మంచిపని చేస్తున్నానని, తేనెటీగలని సంరక్షించటం ద్వారా అందరికీ ఆహారం అందించే ప్రయత్నంలో తనవంతు పాత్ర సమర్థవంతంగా పోషిస్తున్నానని, తద్వారా నలుగురికీ సేవ చేస్తున్నాననే భావనే తనకి చాలా తృప్తినిస్తోంది అంటాడాయన.

ఈమధ్యనే 8వ తరగతి చదువుకుంటున్న ఇతని కుమారునికి జిల్లా సైన్స్ ఫోరం వారు సూర్యరశ్మితో తేనె తుట్టని కరిగించే సాధనం కనుగొన్నందుకు బహుమానం కూడా ఇచ్చారు. సాధారణంగా తేనె తీసిన తర్వాత ఖాళీ అయిన తేనెతుట్టెను ఒక కుండలోనో, గిన్నెలోనో కరిగించి, కొవ్వొత్తులు చేస్తూవుంటారు. ఈ అబ్బాయి కనిపెట్టిన సాధనం ద్వారా మైనం సూర్యరశ్మి కారణంగా కరిగిపోయి, కొవ్వొత్తులు చేసే మూసలోకి పారుతుంది. తద్వారా కొవ్వొత్తులు చేయటం సులభమవుతుంది.

"ఒక సాధారణ వానపాము తన జీవిత కాలంలో కొంత భూమిని సారవంతం చేస్తుంది". పట్టు పురుగు కొంత పట్టు దారాన్నిస్తుంది. మనం మనుషులుగా, అన్నీ తెలిసిన వారిగా ప్రకృతిలో మన పాత్రను పోషించటమే కాక, ఇంకా ఎన్నో పనులు చేయాల్సి వుంటుంది అంటారు పార్దీబన్.

ఇంకా వివరాలు కావలసిన వారు పార్టీబన్‌ను సంప్రదించవలసిన చిరునామా : **ఎ. పార్టీబన్,** 11/18, మకాళీ అమ్మన్ వీధి, కొళ్ళాపూర్ పోస్ట్, గోబిచెట్టి పాళ్యం, మధురై. తమిళనాడు ఫోన్ : 094421 71818 లో సంప్రదించవచ్చు.

# మనందరికీ ఆదర్శం ఈ బామ్మ

**ఆత్మగౌరవం, ఇతరులపై ఆధారపడక పోవటం, జీవితంలో అందరి ప్రేమ పొందగలగటం మనం సాధించాలి. మనం చేసే పనులు ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. ఇంకా ఇంకా మంచి పనులు చేసే ప్రయత్నం చేయాలి. మామూలు జీవితమైనా ఆదర్శవంతమైన జీవితం గడపాలి - కీ.శే. మేబేన్.**

దాదాపు 120 సంవత్సరాల పూర్వం జీవించిన 'మేబేన్' జీవితం ఎన్నో ఒడిదుడుకులతో కూడుకున్నది. ఆమె 5వ తరం వారసులు ఆమె గురించి చెబుతూ 'ఆమె ఒక గ్రంథాలయం, ఒక వ్యవస్థ' అని ప్రేమగా అంటూ వుంటారు.

ఇప్పుడు మనమధ్య లేని 'మేబేన్ దావానంద్ భాయ్ రామ్' కీ.శే. కాలాభాయ్ చదేరా తో ఆమెకి 16 సంవత్సరాల వయసుండగా వివాహమైంది. ఆమె భర్త, అత్త మామలతో గుజరాత్ లోని జునాగడ్ జిల్లా కొడినార్ తాలూకా మూర్వాడ్ గ్రామానికి తరళి వచ్చింది. ఆమెకి 21 సంవత్సరాల వయసు వచ్చేసరికి నలుగురు పిల్లల తల్లి అయింది. ఇద్దరు మగ



పిల్లలు ఇద్దరు ఆడపిల్లలు. అందరూ పశువులు కాసేవారు. ఆమె సంతృప్తికరమైన, ఆనంద దాయకమైన వైవాహిక జీవితం గడిపింది.

సుమారు 100 సంవత్సరాల క్రితం ఆ ప్రాంతంలో భయంకరమైన క్షామం వచ్చింది. వీరి కుటుంబం రోజుల తరబడి తిండి లేకుండా గడపాల్సి వచ్చేది. ఏదోవిధంగా పిల్లలకు తిండి సంపాదించి, వాళ్ళను నిద్రపుచ్చేది బేన్. ఆ కరువు రోజుల్లో ఎంతోమంది తిండి, నీరు లేక చనిపోయారు. ఒకరి దసన సంస్కారం చేసే సరికి ఇంకొకరి శవం సిద్ధంగా ఉండేది ఆ రోజుల్లో. మేబేన్ గతాన్ని గుర్తు తెచ్చుకుంటూ చనిపోయిన వారిని కాల్చటానికి కూడా కట్టెలు ఉండేవి కావు. కూలిపోయిన గోడల చెత్తతో వారిని పూడ్చి పెట్టేవాళ్ళం. గృహ దహనాలు, లూటీలు, మానభంగాలు చాలా మామూలైపోయాయి ఆ రోజుల్లో.

అదేకాలంలో ప్రభుత్వం అనేక ఉపాధి పథకాలు ప్రవేశ పెట్టింది. ఊరందరితో పాటు మేబేన్ కుటుంబం కూడా వాటివల్ల లాభపడ్డారు. ఆమె తన చిన్నపిల్లవాడిని తనతో పాటు తీసుకువెళ్ళి వాడినొక ఇటుకల కుప్ప ప్రక్కన నీడలో కూర్చోపెట్టి తాను పని చేసుకునేది. ఆమె గర్వంగా చెబుతూ వుంటుంది.... "తానెపుడూ తన పిల్లలకి ఏ మందులూ వాడలేదు. ఎప్పుడన్నా అవసరమైతే వేపచెట్టు వేళ్ల రసం పోసేదాన్ని" అని.

కొంత కాలానికి వర్షం పడ్డాక ప్రజలు వ్యవసాయ పనులు ప్రారంభించారు. భూమి తీరు మారిపోయి సారవంత మైంది. ఇంతకు ముందుకన్నా ఎక్కువ దిగుబడి వచ్చిందట.

పశువులకి తగినంత మేత దొరుకుతోంది కనుక ఇంట్లో సమృద్ధిగా పాలు నెయ్యి వుండసాగాయి. పశువుల సంఖ్య కూడా మునుపటి స్థాయికి చేరుకుంది. మేం పండించిన మొక్కజొన్నలు, రాగులు, సజ్జలు మొదలైన ధాన్యాలు క్షేమంగా ఉండటానికి 'కొట్లా' (గాదెలు) లలో జాగ్రత్త చేసేవాళ్లం. పూర్వకాలంలో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసి, ఆహార ధాన్యాలు పండించి మట్టి పాత్రలలో వండుకు తినేవాళ్ళం కనుక ఆ కాలంలో మనుషులు ఆరోగ్యంగా ఉండేవారని అంటుందామె. మేము 'కోడ్యా' రకం పత్తిని పండించేవాళ్ళం. దానికి రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉండేది. అదీకాక, దాని గింజలు పశువులకి మేతగా పెడితే అవి పాలు ఎక్కువగా ఇచ్చేవి అని చెప్పిందావిడ.

ఎప్పుడైనా, ఎవరికైనా జ్వరం వస్తే స్థానికంగా దొరికే సంస్కృతంలో 'జీమాత' ( తెలుగులో 'పనిబీర') అనే మూలిక వాడేవారు. వారు ఈ మూలికను రుబ్బి, గోవుపేడతో కలిపి ఒక బాణలో నీళ్ళుపోసి మరిగించి ఆ ఆవిరిని పీల్చేవారు. దాంతో జ్వరం తగ్గిపోయేది. అలాగే తంగేడు చెట్టు బెరడు రసం రోజూ త్రాగితే కడుపునొప్పి తగ్గిపోయేది. అలాగే వేపచెట్టు వేళ్ల రసం త్రాగినా జ్వరం తగ్గిపోయేది అని చెపుతూ నేనైతే నాకు జ్వరం వస్తే మజ్జిగ త్రాగి పడుకునేదాన్ని. జ్వరం దానంతట అదే తగ్గిపోయేది. అని నవ్వుతూ చెప్పిందామె హనీబీకి.

తాను ఇంతకాలం జీవించటానికి ఆరోగ్యకరమైన సాంప్రదాయపు ఆహారపు అలవాట్లు, ఇంట్లో చేసి తిన్న జొన్న, సజ్జ రొట్టెలు. మేము నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనె వాడేవాళ్ళం. పాలు, నెయ్యి ఎక్కువగా వాడేవాళ్లం. మేము ఎంత తినేవాళ్ళమో దానికి తగ్గ కాయకష్టం చేసేవాళ్లం అన్నదామె. తాను ఇంతకాలం జీవించటానికి అసలు రహస్యం మానసిక శక్తి, నాపై నాకున్న నమ్మకం. నేను ఈ వయసులో కూడా నడవటానికేం ఇబ్బంది పడటం లేదు. కొంచెం చూపు మందగించిందంతే అని చెపుతూ ఇప్పటివరకు మేము చేయగలిగినంత చేశాం, మీతరం కష్టపడాల్సిన తరుణం వచ్చింది. పని చేయకపోతే తిండి దొరకదు మరి. కష్టపడి పనిచేయండి, హాయిగా ఉండండి అని సలహా ఇచ్చిందామె.

ఆమెతో ఉన్నవాళ్ళు ఆమెగురించి చెపుతూ ఎప్పుడైనా, ఏ పనైనా చక్కగా సమయానికి చేయాలనుకుంటే మేబేన్ దగ్గర నేర్చుకోవాల్సిందే అని అంటారు. ఇప్పటికీ కష్టించి పని చేయటానికి ఆమెను ఒక ఉదాహరణగా చెప్పుకుంటారు ఆ గ్రామం వాళ్ళు. ఇంతమంది ప్రేమాభిమానాలకు పాత్రురాలైన ఆమె జీవితం ధన్యం కదా! ●

# ఆకుమచ్చ తెగులు నివారణకు సేంద్రియ మందు

**పసుపు పైరులో తాటాకు తెలుగు (కొన్ని ప్రాంతాల్లో దీన్ని లంబాడా తెగులు అనికూడా అంటారు), మరియు ఆకుమచ్చ తెగులు నివారణకు దేశీయ ఆవు పాలతో తయారు చేసిన మజ్జిగను 5 రోజులపాటు పులియబెట్టి (నిలువ వుంచి) ఎకరానికి 6 లీటర్ల చొప్పున స్ప్రే చేయాలి. ఈ తెగులు నివారణకు మార్కెట్లో లభించే రసాయన మందులైన యం-45, బావిస్టిన్ లాంటి వాటికంటే ఈ పులియబెట్టిన మజ్జిగ ఎన్నోరెట్లు ప్రభావవంతంగా పనిచేస్తుంది. నేను ఒక ఎకరా పసుపు పైరుకు రెండుసార్లు పిచికారి చేయడం వల్ల 33 క్వింటాళ్ళ పసుపు దిగుబడి వచ్చింది.**

**ఈవిధంగా తయారు చేసిన మజ్జిగను తెగులు రాకముందుకాని, వచ్చిన తర్వాతనైనా స్ప్రే చేసి నివారణ చేసుకోవచ్చు. దీన్ని ఒక్క పసుపు పంటలోనే కాదు మచ్చ తెగులు వచ్చే ఏ పంటపైన అయినా స్ప్రే చేసి మంచి ఫలితాలను పొందవచ్చు. ఈ ద్రావణం తెగులు నివారణకే కాదు, పైరు ఎదుగుదల (గ్రోత్ ప్రమోటర్)గా కూడా పని చేస్తుంది. దేశీ ఆవు మజ్జిగ అయితే 100 వాతం ఫలితం వుంటుంది. దేశీ గేదె మజ్జిగ అయితే 50 శాతం ఫలితం వుంటుంది. వివరాలకు సంప్రదించండి :**

**కొండా కిషోర్ రెడ్డి, తూములూరు గ్రామం & పోస్ట్, కొల్లిపర మం., గుంటూరు జిల్లా. సెల్ : 99593 38733.**

# కీటకాలను ఆకర్షించి మట్టుపెట్టే పరికరము

పంటపొలాలను క్రిమి కీటకాల బారినుండి రక్షించుకోవడానికి రైతులు అనేక రకాల రసాయన మందులను పిచికారి చేస్తుతన్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ ఆ రసాయన పురుగు మందుల వాడకం వలన పర్యావరణానికి కలిగే హానికాని, వ్యవసాయ రంగానికి ఏర్పడిన ముప్పు గురించికాని ఈమధ్య కాలంలో విపరీత పోకడలతో రకరకాల జబ్బులబారి పడుతున్న వైనము అంతర్లీనంగా వున్న కారణాలను బేరీజు వేసుకోవలసిన సమయం ఆసన్నమైంది.

ఈమధ్యకాలంలో కేరళ రాష్ట్రంలో మనోక్రొటోఫాస్ అనే రసాయన మందును వాడకుండా నిషేధించాలని పెద్దయెత్తున ఉద్యమమే జరిగింది. పార్లమెంటులో కూడా ప్రత్యేక ప్రస్తావన జరిగింది. విదేశాలలో నిషేధించినా కూడా మన ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని అందరూ తప్పు పడుతున్నారు. ఇక డి.డి.టి. అనే రసాయన మందు గురించి చెప్పనవసరం లేదు.

ఈ రసాయన మందుయొక్క అవవేషాలు పశువుల పాలలోను బాలింతల చనుపాలలోను గమనించి నిషేదించడం జరిగింది. ఇంతే కాకుండా ఈమధ్యకాలంలో పత్తి గింజల నూనెలో కూడా రసాయన మందుల అవశేషాలు కనుగొన్నందున మన ఆహారంలోని అన్ని వస్తువులలోను రసాయన అవశేషాలు చేరి మన శరారాలను విషతుల్యం చేస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఈ రసాయన మందులు వాడకానికి ప్రత్యామ్నా యంగా వాతావరణానికి హాని లేకుండా నిరపాయంగా క్రిమి కీటకాల బారినుండి పంటలను రక్షించుకోవడానికి ఈ చిన్నపరికరం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇందులో ఒక వెడల్పాటి ప్లాస్టిక్ టబ్, మధ్యలో ప్లాస్టిక్ స్టాండు, దానిలో ఒక సోలార్ ల్యాంప్ ఏర్పాటు చేయాలి. ఆ టబ్బునిండా నీళ్ళు పోసి కొంచెం కిరోసిన్ అందులో వేసి తొలకరి వర్షానికి పొలాన్ని దున్నిన తదుపరి అక్కడక్కడా వీటిని ఏర్పాటు చేయాలి. ఉదయం నుండి



సాయంత్రం దాకా సూర్యరశ్మి వలన సోలార్ ల్యాంప్ చార్జింగ్ జరిగి సాయంత్రం కాగానే అది వెలుగుతుంది. ఆ వెలుతురుకు ఆకర్షింపబడిన క్రిమి కీటకాదులు టబ్‌లోని నీళ్ళలో పడి చనిపోతాయి.

ఈ ప్రక్రియ రాత్రి 12 గంటల వరకు జరిగిన తర్వాత సోలార్ ల్యాంప్ ఆపివేయవలెను. ఎందుకంటే రాత్రి 12 గంటల తరువాత పంటలకు మేలు చేసే క్రిమి కీటకాదులు సంచరిస్తాయి. అందువల్ల రాత్రి 12 గంటల తరువాత సోలార్ ల్యాంపులను తప్పనిసరిగా ఆర్పివేయాలి. ఈ ప్రకారంగా టబ్బులను పొలంలో మార్చి మార్చి ఏర్పాటు చేస్తూ క్రిమి కీటకాదులను నివారించడానికి ఎంతో ఉపయుక్తంగా పనిచేస్తుంది.

ప్రస్తుతం రాత్రి 12 గంటల తరువాత మానవ ప్రయత్నం లేకుండానే ఆటోమాటిక్‌గా ఆ ల్యాంపు ఆరిపోయే సౌకర్యం కూడా కనిపెట్టబడుతోంది. ఇలా చేయగలిగితే రైతు రాత్రి 12 తరువాత పొలంలో సోలార్ ల్యాంప్‌లను నిలుపు చేయటానికి వెళ్ళవలసిన అవసరం ఉండకుండానే పని జరిగిపోతుంది.

**వివరాలకు సంప్రదించండి :**

**సి. హెచ్. శ్యామ్‌ప్రసాద్, వరంగల్. సెల్ : 99082 83241.**

# కొత్త పరికరాల సృష్టికి అవసరాలే మూలం

తనకు ఏదైనా అవసరం అనిపిస్తే ఆ అవసరాన్ని ఎలా అధిగమించాలా అని ప్రతిఒక్కరూ ఆలోచిస్తారు. అలాంటి అవసరమే ఓ వ్యవసాయ పనిముట్టు తయారీకి ప్రేరేపించింది. రంగారెడ్డి జిల్లా, పెద్దేముల్ మండలానికి చెందిన బుద్దారం గ్రామ రైతు కొత్తూరు ఆనందం డిగ్రీ వరకు చదువుకున్నా తన తండ్రి ఎల్లప్పకు చేదోడు వాదోడుగా వుంటూ వ్యవసాయంతో తనవంతు సహాయాన్ని అందిస్తున్నాడు.

పొలంలో పెరిగిపోతున్న కలుపు, దాన్ని తీయటానికి వ్యవసాయ కూలీల కొరత కలవరపెట్టగా దీని నివారణకై ఆలోచించాడు. ఎక్కువగా సైకిల్‌పైన తిరిగే ఆనందం అదే సైకిల్‌తో ఓ పరికరాన్ని తయారు చేస్తే ఈ సమస్యను అధిగమించొచ్చు అనుకున్నాడు. తోచిందే తడవుగా ఓ పాత సైకిల్‌ను రూ. 150కి కొన్నాడు. దాని వెనుక భాగాన్ని తొలగించి, ఆ స్థానంలో కలుపు నివారణకు అవసరమయ్యే గుంటికను తయారు చేశాడు. సైకిల్ సీటును తొలగించి ఆ స్థానంలో హ్యాండిల్‌ను అతికించాడు. గుంటికను పలుగును మార్చుకోవటానికి అనువుగా తయారు చేశాడు. ఇక పొలంలో కలుపు తీయటానికి ఎంచక్కా తనే పూనుకున్నాడు. ఫలితం ఒక ఎకరానికి కలుపు తీయటానికి రూ. 2 వేల దాకా అయ్యే ఖర్చును ఈ పరికరం సహాయంతో కేవలం రూ. 500 లతో పని పూర్తి చేశాడు.

దీనిని తయారు చేయటానికి ఆనందానికి అయిన ఖర్చు రూ. 350లు మాత్రమే. ఈ పరికరం ద్వారా ఒక్క మనిషి రోజుకు ఒక ఎకరం పొలంలో అంతర సేద్యం ద్వారా కలుపును తీయవచ్చు. రోజు రోజుకూ వ్యవసాయ కూలీల లేమి తీవ్రతను ఇలాంటి పరికరాల ద్వారా నివారించుకొని రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవటానికి 'పల్లెసృజన' తనవంతు సహకారాన్ని అందిస్తుంది. మీ ప్రాంతాలలో కూడా ఇలాంటి పరికరాలు ఏవైనా కనిపెట్టినట్లయితే వెంటనే మాకు తెలియజేయండి. వాటిని ప్రచురించడం ద్వారా ఇతర రైతులు కూడా ఆ పరికరాన్ని తయారు చేసుకొని తమ వ్యవసాయాన్ని లాభసాటిగా, సులువుగా కొనసాగించటానికి వీలుపడుతుంది.



**అలా అవసరం ఒక పరికరాన్ని సృష్టించేలా చేసింది. ఇలాంటి ఏవైనా పరికరాలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి... పల్లెసృజనలో ప్రచురిస్తాం. - ఎడిటర్**

**'పల్లెసృజన' పాఠకులకు ఒక విజ్ఞప్తి**

మీ నిత్య జీవితంలో కాని, వృత్తి జీవితంలో కాని ఎదురయ్యే అనేక సమస్యలకి మీరేవిధంగా నివారణోపాయా లు కనుగొన్నారో లేదా ఇతరుల వద్దనుంచి తెలుసుకొని ఆచరించారో మాకు తెలియజేస్తే దానిని నలుగురి మేలు కోసం మన 'పల్లెసృజన'లో ప్రచురిస్తామని తెలియజేస్తున్నాము **- ఎడిటర్**

**గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక**

**పల్లెసృజన**

**ను మీ వేదికగా ఉపయోగించుకోవాలనుకుంటున్నారా?**

**మీ ఆలోచన ఎంత చిన్నది అయినా సరే మేము ఆహ్వానిస్తాం**

**వెంటనే పంపండి** - సంపాదకవర్గం

## 'ఇగ్నైట్ - 12' పోటీలలో

# ఆదివాసి చిన్నారుల చిలిపి జ్ఞానం

### పాఠాలు సినిమాలా చూపిస్తే....!

మాకు మాస్టార్లు బోర్డుమీద పాఠాలు చెప్పేకంటే బొమ్మల ద్వారా అంటే కంప్యూటర్ ద్వారా చూపిస్తే బాగుంటుంది. పిల్లలకు సినిమా చూస్తే ఎలా గుర్తుంటుందో అలాగే కంప్యూటర్ ద్వారా పాటలు చెప్తే పాఠాలు కూడా సినిమా లాగా బాగా గుర్తుంటాయి అనుకుంటున్నాను. ఈ విధానం వల్ల మన దేశం విద్యారంగంలో అభివృద్ధి చెందుతుంది.

**– బి. సల్మాన్,** 9వ తరగతి, జి.ఎ.హెచ్. స్కూల్, కించుమండ, రంగిలిసింగి గ్రామం, డుంబ్రిగూడ మండలం, విశాఖ జిల్లా.



### మామిడి చెట్టు

మామిడిచెట్టులో వుండే అన్ని పరికరాలు....

మామిడి మొక్క ఏర్పడాలంటే ముందుగా మామిడి టెంకను పాతాలి. తర్వాత చిన్న మామిడి మొక్క ఏర్పడుతుంది. మామిడి మొక్కను మనము జాగ్రత్తగా కాపాడుకోవాలంటే ముందుగా ఒక చిన్న గూడును కట్టాలి. మొక్క జాగ్రత్తగా వుండాలంటే ప్రతిరోజూ నీరు పోయాలి. మొక్క ఆకులను పశువులు తినకుండా జాగ్రత్తపడాలి. మామిడి చెట్టుకు ముందుగా పూలు పూస్తాయి. తర్వాత కాయలు కాస్తాయి, తర్వాత అవి పండ్లుగా మారుతాయి. చెట్టువల్ల ఇన్ని లాభాలున్నాయి. ఆ చెట్టే నీడను కూడా ఇస్తుంది. ఆ చెట్టు కొమ్మలతో మనము కుర్చీలు, బల్లలు లాంటి అనేక రకాల పరికరాలు తయారు చేసుకోవచ్చు. ఇది స్వచ్ఛమైన గాలి కూడా ఇస్తుంది. కాబట్టి చెట్లు పెంచండి.

**– పొంగి వెంకటేశ్వర రావు,** 10వ తరగతి, జి.ఎ.హెచ్. స్కూల్, కించుమండ, గుంటసీమ, విశాఖ జిల్లా.



### వృత్తం గీయాలంటే.....

నేను ఎప్పుడైనా వృత్తం గీయాలంటే వృత్త స్కేలును ఉపయోగించను. ఒక కాగితం తీసుకుని మడత పెట్టి రెండుప్రక్కల చిన్న రంధ్రాలు చేస్తాను. ఒక కన్నంలో పిన్నుగుచ్చి, రెండో కన్నంలో పెన్సిల్ పెట్టి వృత్తాకారంగా గీస్తాను.

**– టి. తుంనాద్,** 10వ తరగతి, జి.ఎ.ఎస్. స్కూల్, కించుమండ, బొర్రపాలెం గ్రామం, విశాఖ జిల్లా.

Vol-1, Issue - 1 PALLE SRUJANA July-Aug 2012

గుర్తింపు

## 6వ ద్వైవార్షిక జాతీయ పురస్కారాలు - మార్చి 2012

# భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాసింగ్ పాటిల్ చేతులమీదుగా పురస్కారాలు పొందిన గ్రామీణ ఇన్నోవేటర్ల వివరాలు



**జాతీయ స్థాయి మొదటి బహుమతి:**

**తక్కువ ఖర్చుతో గాలిమర**

**మహమ్మద్ మెహతర్ హుసేన్ & ముస్తాక్ అహమ్మద్, అస్సాం**

దీని శక్తి సామర్థ్యాలు గమనించిన గుజరాత్‌లోని పశ్చిమ 'గ్యాన్' వారు 40 ఇటువంటి మరలను గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో సాగునీటిని సరఫరా చేయటానికి ఉప్పు నీటిని పంపు చేయ టానికి ఏర్పాటు చేసింది. దీని డిజైన్‌లో స్థానిక ఇన్నోవేటర్లు కొన్ని మార్పులు చేశారు. ఇది దేశంలోని ఈశాన్య ప్రాంతం నుండి పశ్చిమ భాగానికి సాంకేతిక పరిజ్ఞానం మార్పిడికి ఉత్తమమైన ఉదాహరణగా చెప్పుకోవచ్చు.



**అభివృద్ధి పరచబడ్డ బల్వాన్ ఉల్లిగడ్డ విత్తనం:**

**బల్వాన్‌సింగ్, హర్యానా....**

50 సంవత్సరాల బల్వాన్ సింగ్ హర్యానా లోని భివాని గ్రామానికి చెందిన ఇన్నోవేటరే కాక అభ్యుదయ రైతు కూడా. ఇతను చాలా కాలం నిల్వ ఉండి, అధిక దిగుబడి నిచ్చే కొత్తరకం ఉల్లిగడ్డను రూపొందించాడు. ఎక్కువ ఎరువులు లేకుండా, త్వరగా బూజు పట్టకుండా, దళసరి పొరలు ఉండటం ఈ రకం ప్రత్యేక లక్షణాలు.



హర్యానా వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు తాము స్వంతంగా రూపొందించిన ఉల్లిగడ్డ రకంకన్నా ఈ రకమే బాగుందని కితాబునిచ్చారు. స్థానికంగా దొరికే ఇతర రకాలకన్నా ఇది ఎక్కువ కాలం నిలువ ఉంటుంది.

**జాతీయ పురస్కారం - 2వ బహుమతి:**

**సమర్థవంతంగా పనిచేసే కొబ్బరిచిప్పలు/ కట్టెల పొయ్యి:**

**విజయ ప్రకాష్, కేరళ**

కేరళ రాష్ట్రానికి చెందిన విజయప్రకాష్ ఇంధనం పూర్తిగా మండటానికై 2వ అరని కూడా ఏర్పాటు చేసి ఈ పొయ్యిని రూపొందించాడు. దీనిలో ఆయన ఎన్నో రకాలైన నమూనాలు తయారు చేశాడు. కట్టెలు వాడితే దీని మండే శక్తి 37.67% ఉండగా, ఎండు కొబ్బరి చిప్పలు వాడితే అది 29.48% ఉంది.



**అధిక దిగుబడినిచ్చే మిర్యాల రకం - పెప్పర్ టెక్కెన్:**

**టి.టి. థామస్, కేరళ**

కేరళ, ఎదుక్కి ప్రాంతంలోని 71 సంవత్సరాల రైతు కె.కె. థామస్. ఈయన అధిక దిగుబడినిచ్చే మిర్యాల రకాన్ని రూపొందించాడు. ఇది ఒక్క గుత్తిలో దాదాపు 1000 మిర్యపు గింజలను ఇస్తుంది. దీనిలో ప్రత్యేకత ఏమిటంటే మామూలుగా మిర్యపు చెట్టు నిలువుగా వుండి, చివరన ఒకటే గుత్తి ఉంటుంది. కానీ, దీనిలో అనేక కొమ్మలుండి, ప్రతి కొమ్మకు ఒక గుత్తి మొలుస్తుంది. భారత సుగంధ ద్రవ్యాల పరిశోధనా సంస్థ ఐఐయస్ఆర్. ఈ రకం ఎక్కువ కొమ్మలు ఉండి,



కొమ్మ కొమ్మకు గుత్తులు కాయ టం, అధిక దిగుబడినివ్వటం కారణంగా దీనిని ప్రత్యేకమైన మిర్యపు చెట్టు రకంగా దీనిని గుర్తించింది.

**మూడవ జాతీయ అవార్డు:**

**చర్మ రోగాలకై మూలికా ఔషధం:**

**సామాజిక బహుమతి**

**రాంజీ, బెహంజీ ఫర్వాన్,**

**సామూహిక ప్రతినిధి, గుజరాత్**



గుజరాత్‌కు చెందిన 49 సంవత్సరాల రాంజీ బెహన్‌జీ ఫర్వాన్ మనుషులకి, జంతువులకి కూడా మూలికా వైద్యం చేయటం లో ఎంతో అనుభవమున్న వ్యక్తి. ఆయన చర్మ రోగాలకు పనికి వచ్చే ఒక ఔషధాన్ని 'సృష్టి' కి తెలియజేశాడు. 'సృష్టి' వారు వారి 'సంశోధన్' ప్రయోగశాల లో దీనికి కొన్ని సాధారణంగా దొరికే ఇతర పదార్థాలు కలిపితే ఇంకా సమర్థవంతంగా పనిచేస్తుందని గమనించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రీసర్చ్ వారు దీనిని పరీక్షించి ఇందులో హానికర పదార్థాలు లేవని నిర్ధారించారు. దీనిని కొంతమంది మీద పరీక్షించి చూడగా, ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయి. 'సృష్టి' వారు 'జమాటిక్' అనే పేరుతో వాణిజ్యపరంగా దీనిని విడుదల చేశారు. దీని అమ్మకాలపై వచ్చిన లాభాలను రాంజీభాయ్, అతని సమాజమే కాక, దీనికి వాడే మొక్కనే చర్మ రోగాలకి వాదుతున్న సమాజాలు కూడా కలిసి పంచుకుంటాయి. అహమ్మదాబాద్ జిల్లాకు చెందిన గౌతమ్‌భాయ్ పర్మార్ అతని సమాజం కూడా ఈ జ్ఞానాన్ని పంచుకున్నట్టు గుర్తించటం జరిగింది.

**ఆవులలో వచ్చే మూడు రోజుల జ్వరానికి మూలికా ఔషధం:**

**నేవల్ కిషోర్ సింఘ్, సామాజిక ప్రతినిధి, బీహార్.**

59 సంవత్సరాల నేవల్ కిషోర్ సింఘ్ మూలికా వైద్యంలో సాంప్రదాయ జ్ఞానంలో అపారమైన అనుభవం ఉంది. ఆవులకి సాధారణంగా వచ్చే ఈ మూడురోజుల జ్వరానికి ఒక ఔషధం తయారు చేశాడు. (పేటెంట్ దరఖాస్తు నెం. 2243/సి.హెచ్.ఇ./2008) దీనిని జంతువులపై పరీక్షించి చూడగా ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా ఉన్నాయి. ఈ పరీక్షలలో ఈ మందు వాడటం వలన పశువుల కాలేయానికి ఏ విధమైన హానీ జరుగదని స్పష్టంగా నిరూపించబడింది. ఇతర ఏ విధమైన దుష్పరిణామాలు లేవు. మహారాష్ట్ర పర్భని లోని పశువైద్య కళాశాల వారు కూడా దీనిపై అనేక ప్రయోగాలు చేసి దీని ప్రభావాన్ని నిర్ధారించటంతో పాటు నోటి ద్వారా తినిపించగల ఔషధాన్ని కూడా రూపొందించారు.



**ఎక్కువ మైలేజ్ ఇచ్చేలా ఆటో ఇంజన్‌లో మార్పులు:**

**సిబ్ శంకర్ మండల్, అస్సాం.**

శిబ్ శంకర్ మండల్ ఒక ఆటో రిక్షాలోని ఇంజను, ఇంధన సరఫరా వ్యవస్థలో, చక్రాలలో మార్పులు చేసి ఎక్కువ మైలేజీ వచ్చేలా రూపొందించాడు. (పేటెంట్ దరఖాస్తు సంఖ్య 1811/కె.ఓ.ఎల్./2008) ఈయన ఎగ్జాస్ట్ నుంచి వచ్చే ఒక వేడిని ఉపయోగించి గాలిని వేడి చేసి లోపలికి పంపే పద్ధతిని అవలంభించాడు. వాహనం ఎక్కువ దూరం నడవటానికి చక్రాల సైజులో, గేర్ల నిష్పత్తిలో కూడా మార్పు చేశాడు. ఈయనకి ఎన్.ఐ.ఎఫ్. వారు ఐ.ఐ.టి. గౌసతి వారు సహాయమందించి మామూలు ఆటో ఇంజన్లకన్నా ఈ పద్ధతిలో 35% ఎక్కువ మైలేజీ వస్తుందని నిర్ధారించారు. ఈయనని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహమ్మదాబాద్ వారు నిర్వహించిన 'టాటా ఇన్నోవేషన్' పురస్కారాల సభలో తన ఇన్నోవేషన్‌ను ప్రదర్శించడానికి అవకాశమిచ్చారు. శిబ్‌శంకర్ తన సోదరుడు జయశంకర్‌తో కలిసి రిక్షాలకి షాక్ అబ్జార్బర్‌లు, అలాగే నూడిల్స్ తయారు చేసే యంత్రాన్ని కూడా రూపొందించారు.



### ఖమ్మం జిల్లా 'చింతూరు' నుండి 'మోతుగూడెం' వరకు 2012 జూన్, 15 నుండి 17 వరకు జరిగిన

# 4వ చిన్నశోధయాత్ర

## యాత్రీకుల స్పందన



**రాజేష్ చతుర్వేది, ఐఐఐటి, హైదరాబాద్ విద్యార్థి స్పందన :**

జీవితకాలంలో ఒకేసారి దొరికే యాత్ర ఇప్పుడే పూర్తయింది. నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. అసలెక్కడ మొదలు పెట్టాలో తెలియటం లేదు. అక్కడ జరిగింది ప్రతిదీ అద్భుతంగా, ఉత్సాహజనికంగా ఉంది. అవన్నీ ఎలా చెప్పాలో తెలియటం లేదు.

సరే.... ముందు నాకు 4వ చిన్నశోధయాత్రలో పాల్గొనాలన్న ఆలోచన ఎలా వచ్చిందో చెప్తాను. మా లెక్చరర్ శ్రీమతి వేమూరి కవిత గారు మా విద్యార్థులందరికీ ఈ యాత్ర గురించి తెలియజేశారు. ఆమెకూడా పాల్గొనాలనుకున్నారు కానీ, వేరే అత్యవసర కారణాల వల్ల అది కుదరలేదు. నేను నా మిత్రులను కొందరిని యాత్రలో పాల్గొనమని అడిగాను. ఇళ్ళకు వెళ్ళాలని, ప్రణాళిక వేసుకుని ఏర్పాట్లు చేసుకున్నవాళ్ళు కొందరు యాత్రలో దాదాపు 50 కి.మీ. నడవాలన్న భయం కొద్ది కొందరు వెనుకంజ వేశారు.

జూన్ 13, 2012 నాడు నాకు సుస్తీ చేసింది. నేను నా యాత్రా కార్యక్రమాన్ని రద్దు చేసుకుందామనుకున్నాను. కానీ జీవితంలో మళ్ళీ ఇటువంటి అవకాశం వస్తుందో రాదోనని ఆలోచించాను. మరునాడు 14వ తారీఖున సరిగ్గా నేను బయలుదేరే సమయానికి కుండపోతగా వర్షం ప్రారంభమైంది. మళ్ళీ ఒకసారి నా యాత్రను రద్దు చేసుకుందామనుకున్నాను. కానీ నా జాతకంలో మంచి జరగాలసుంది కనుక ఆ ఆలోచన వీగిపోయింది. ఆ సాయంత్రం భద్రాచలం వెళ్ళే రైలెక్కాను. భద్రాచలం రోడ్ స్టేషన్‌లో నా తోటి శోధయాత్రీకుడు రాజేశ్వర్‌తో కలిశాను. ఇద్దరం పవిత్ర గోదావరి నదిలో స్నానం చేసి, శ్రీరాములవారి దర్శనం చేసుకున్నాము. అంతా సవ్యంగా జరిగి యాత్ర ప్రారంభమయ్యే 'చింతూరు' గ్రామానికి 15వ తేది ఉదయం 10 గంటలకల్లా బయలుదేరి 12 గంటలకల్లా అక్కడికి చేరుకుని, మా తోటి యాత్రీకుల్ని పరిచయం చేసుకున్నాము.



అక్కడ గణేశం సార్ ఈ యాత్రలో మాకు తారసపడే ప్రకృతి, గ్రామస్తులు, తోటి యాత్రీకులు, ఎవరికి వారు అని నలుగురు టీచర్ల గురించి చెప్పారు. మా పేర్లు నమోదు చేసుకోవడం పూర్తయిన తర్వాత అక్కడ బడి పిల్లలతో కొంతసేపు గడిపాము. వారిలో కొత్తది నేర్చుకోవాలి అనే ఉత్సాహం, పట్టుదల మాకెంతో నచ్చాయి. వారితో సమయం గడుపుతూ వుండగా, వారిని ఉత్తేజ పరుస్తూ వుండగా మాకు చిన్న పిల్లల ఆలోచనల నుంచి ఎలా విషయాలు తెలుసుకోవచ్చునో తెలిసొచ్చింది. వారికి సరియైన వసతులు లేకపోవటం చాలా బాధనిపించింది. నర్సరీ క్లాసు నుండి 3వ తరగతి వరకు చదివే చిన్న పిల్లలందరూ ఒకే తరగతి గదిలో కూర్చోవటం కనిపించింది. అంతకన్నా బాధాకరమైన విషయం లేదనిపించింది. కానీ ఇంతలోనే ఎప్పటికైనా పరిస్థితులు మారి మంచిరోజులు వస్తాయన్న ఆశ కలిగింది.

మా సామాన్లతో వ్యాను బయలుదేరగానే బ్యానర్లు, కరపత్రాలు, పత్రికలు చేతబూని మేమూ బయలుదేరాము. మార్గమధ్యంలో మాకు కనిపించిన వారందరికీ చిన్న పిల్లలకి 'ఇగ్నైట్' పోటీలు జరుగుతున్నాయని, అందులో పాల్గొన్నవారి ఆలోచనలని మన మాజీ అధ్యక్షులు శ్రీ అబ్దుల్ కలాం గారు స్వయంగా పరిశీలిస్తారని, ఉత్తమమైన వాటికి బహుమానాలు, పేటెంట్లకి కూడా ఏర్పాట్లు చేస్తారని చెపుతూ ముందుకు సాగాము. కొంతసేపటికి మాకు ఆకలేసింది. అక్కడి గ్రామానికి చెందిన దంపతులిద్దరూ మాకు చాలా రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. అది ఎంతబాగా ఉందంటే సాధారణంగా వరి అన్నం ఎక్కువ తినని నేను కూడా పూర్తిగా లాగించేశా! అక్కడ మేము ప్రకృతితో గ్రామస్తులు కలిసి మెలిసి ఎలా జీవిస్తారో తెలుసుకున్నాము. వారక్కడ వాననీటిని కూడా పొదుపు చేసే పద్ధతులు, సౌరశక్తికై ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవటం చూసి మన పట్నవాసులకి ఈ ఆలోచనలు రావుకదా అనిపించింది. అక్కడ మేము ఆ పల్లెవాసులు వివిధ వస్తువులని పొదుపుగా ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకొని ఇంకా ఆ పద్ధతులని మెరుగు పరుచుకునే అవకాశాలున్నాయేమోనని చర్చించాం. అక్కడే మెరుగ్గా పనిచేసే వంటపొయ్యి ప్రసక్తి కూడా వచ్చింది. దానిని గురించి ఆసక్తిగా విన్నారు.

కొన్ని గంటలు నడిచి 'పోతంపల్లి' అనే గ్రామం చేరుకున్నాము. అక్కడ బడిపిల్లలతో కొందరు పెద్దలతో మాట్లాడే అవకాశం దొరికింది. ఆ పిల్లలు చాలా ప్రతిభావంతంగా ఎంతో ఉత్సాహంగా పాటలు, నృత్యాలు చేశారు. గణేశం గారు తన ల్యాప్‌టాప్ ఆధారంగా వారికి





కొన్ని ఆసక్తికరమైన విషయాలు చెప్పి, వారి స్పందన అడిగారు. ఇది అందరికీ ఎంతో నచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి మేము వెదురుని సమర్ధవంతంగా వాడటం ఎలా? మహిళలు తలపై బరువును మోసేటప్పుడు మెడ కుదించుకుని పోకుండా ఏం చెయ్యాలో లాంటి విషయాలపై వీడియోలు చూపించాము. గణేశం గారు పెద్దలతో మాట్లాడుతుంటే మేమక్కడ పిల్లలతో కొద్దిసేపు ఆడుకున్నాం. వారికి పెన్నులు, పుస్తకాలు బహూకరించాం. చాలా ఉల్లాసంగా గడిచిందా సమయం. అక్కడినుంచి కొంత దూరం ప్రయాణం సాగించే సరికి మార్గంలో కొందరు విల్లంబులు ధరించిన యువకులు కనిపించారు. జంతువులని వేటాడటం వారి వృత్తిట! వారి వద్ద బాణాలు సంధించటంలో కొన్ని పాఠాలు నేర్చుకున్నాం. చీకటి పడుతోంది, ఇంకా చాలా దూరం నడవాల్సి వుంది. గణేశం గారు చక్కటి ఆసక్తికరమైన కబుర్లు చెబుతూ వుంటే అలుపెరుగకుండా ప్రయాణం సాగించాం. ఆయన తాను మిలటరీలో పనిచేస్తున్నప్పటి కబుర్లు, యుద్ధాలు, గ్రామీణ జీవితం, ప్రకృతి, పట్టణ జీవితం.... ఇలా ఎన్నో విషయాలు మమ్మల్ని ఉత్తే పరిచే విధంగా మనసులకి హత్తుకుపోయే విధంగా చెప్పారు. మా యాత్రీకుల్లో కొందరికి నడవటం కష్టం అనిపించినవారు ఉన్నారు, అలిసిపోయిన వారున్నారు కానీ, ఉత్సాహం తగ్గినవారు మాత్రం లేరు. ఆ మాటలు వింటూ 'తులసిపాక' గ్రామంలోని ఒక పాఠశాల చేరుకున్నాం. అక్కడ ఆరోజు అనుభవాలను నెమరు వేసుకుని, భోజనం చేసి, నిద్రకు ఉపక్రమించాం. ఆరుబయట నిద్ర మధ్యలో వానొచ్చి నిద్ర చెడినా తర్వాత చల్లని గాలి రావటంతో అలసట మరిచి నిద్రపోయాం. మర్నాడు ఉదయం పాఠశాల వెనుకవున్న సెలయేట్లో స్నానం చేశాం. చాలా కొత్తగా అనిపించింది. ప్రకృతి ఒడిలో ఆటలాడుతున్నాం అనిపించింది. ఉదయం అల్పాహారం ముగించేముందు నేను అక్కడివారి జీవితం, పిల్లల ఆటలు గమనిస్తూ వుండిపోయాను. పిల్లలు వారికి అందుబాటులో వున్న వస్తువులతోనే క్రికెట్, హాకీ లాంటి ఆటలు ఆడటం చూస్తూవుంటే ముచ్చటేసింది. అల్పాహారం తినే సమయంలో గణేశం గారు ఒక ప్రశ్న వేసి, దానిపై మా స్పందన ఏమిటి అని అడిగారు. ఆయన 'క్రాక్' (చీలిక) చూస్తే ఏమనిపిస్తోందో అనుకూలంగా ఆలోచించి చెప్పమన్నారు. కొందరు సంకేతమని, ప్రమాద సూచకని, పరీక్షలో పాసవటమని రకరకాలుగా చెప్పారు. రేవతి అనే అమ్మాయి 'చీలిక'లో నుండి (గుడ్డు) కొత్త జీవితం వస్తుంది అన్నది. చాలా బాగా అనిపించింది. గణేశం గారు చీలికలో నుండి వెలుగు కనిపిస్తుందని, స్ఫూర్తినిస్తుందని చెప్పారు. తర్వాత గ్రామస్తులతో కలిసి వారితో చర్చించి, పశువులలో పాలు వృద్ధి చేయటానికి, మొక్కలు ఏపుగా పెరగటానికి పనికివచ్చే కొన్ని మందు పొట్లాలు పంచాం. అక్కడే వున్న బోరింగ్ పంపు ఇంకా సమర్ధవంతంగా పనిచేయటానికి ఎటువంటి ఏర్పాట్లు చేసే బావుంటుందో చర్చించాము. ఇంకా జీవ వైవిధ్యం, గ్రామీణ జీవన విధానం, వెదురుని ఇంకా సమర్ధవంతంగా ఉపయోగించటం, చెట్లెక్కే పద్ధతులు లాంటి ఎన్నో విషయాల గురించి చర్చించాము.





తర్వాత ఒక గ్రామంలో 12 సం. వయసున్న పిల్లవాడొకడు కేవలం ఒక గంటలో వెదురుతో చెట్లెక్కడానికి ఒక నిచ్చేన తయారు చేయటం చూసి ఆశ్చర్యపోయాం. అదే మనం చేస్తే ఎన్ని రోజులు పడుతుందో కదా! అనిపించింది. అదే సమయంలో వెదురులో ఎన్నో వినూత్న ప్రక్రియల గురించి చర్చించాము. అటువంటివారు దేశంలో చాలా మంది ఉన్నారని గణేశం గారు చెపితే చాలా ఆశ్చర్యం గర్వం కలిగాయి. అందరు యాత్రీకులు ఆ పిల్లవాడు ఇంజనీరు కావాలనుకునే కల సాకారం చెయ్యటానికి సహాయం అందిస్తామని మాట ఇచ్చారు. కొంత దూరం నడక తర్వాత, రోడ్డుప్రక్కన కూర్చుని మాటలు సాగించాం. ప్రసవ సమయంలో గ్రామీణ మహిళలు, పట్టణ మహిళల్లో గల వ్యత్యాసాన్ని గురించి చర్చించాము. పట్టణాలలో జరిగే ప్రసవాలలో శిశువులు పుట్టిన వెంటనే ఎక్కువ వెలుతురు చూడాల్సి వస్తుంది. అలాగే బొడ్డు తాడుని కూడా వెంటనే కత్తిరించి వేస్తారు. కానీ, పల్లెల్లో శిశువులు చీకటి గదిలో పుడతారు. శిశువు క్రొత్త వాతావరణానికి అలవాటు పడ్డ తరువాత బొడ్డుతాడు కోస్తారు. దీనితో వారీ ప్రపంచంలోనికి సజావుగా, కంగారు లేకుండా రావటానికి అవకాశం ఏర్పడుతుంది.

తర్వాత నడక త్వరత్వరగా సాగించాం. మేము వెళ్ళిన గ్రామంలోని గ్రామస్తులంతా భూమిపూజ ఉత్సవంలో మునిగి వున్నారు. అక్కడే ఒక చెట్టుక్రింద కూర్చొని 'హనీబీ/ పల్లెసృజన' ద్వారా ప్రాచుర్యం పొందిన మల్లేశం గురించి 'ఆసు కుటుంబం' గురించి తెలుసుకున్నాం. ఆయన ఎదుర్కొన్న కష్టాలు, చూపించిన పట్టుదల, సాధించిన విజయాలు, ఇప్పుడాయన తోటి గ్రామస్తులకిస్తున్న చేయూత, ఆ గ్రామంలోనివారు ఆర్థికంగా ఏవిధంగా మెరుగైన జీవితం అనుభవిస్తున్నారో తెలుసుకున్నాం, అలాగే చదువురాని విక్రం రాథోడ్ తదితరులు చేసిన ఇన్నోవేషన్ల గురించి గ్రామస్తులు ట్రాక్టర్ ట్యూబులో నీళ్ళు నింపి వాడటం, విషపూరిత మొక్కలను క్రిమి సంహారక మందులుగా వాడటం లాంటి విషయాల గురించి మాట్లాడుకున్నాం...... నిజంగా చాలా ప్రేరణ కల్పించాయి అందరిలో.

అక్కడ గ్రామస్తులు పండగ హడావిడిలో వున్న కారణంగా ఎక్కువగా మాతో కలువలేకపోయారు. వీడ్కోలు తీసుకుని ముందుకు సాగాం. ఆ నడకలో గణేశం గారు ఎన్నో విషయాలు చెప్పారు. అవి వింటూ మేము అలుపెరుగకుండా ఏపి జెన్‌కో హాస్టల్‌కి రాత్రి 7-30కి చేరుకున్నాం (16, జూన్). అక్కడ ఒక హోటల్‌లో భోజనం చేశాం. అక్కడ ధనుంజయ అనే ఒక ఇన్నోవేటర్ తాను రూపొందించిన అనేక పనులకు ఉపయోగపడే ట్రాక్టర్ అనుసంధానం చేసే సాధనం గురించి చెప్పారు. దానికి ఆయనకి 'పల్లెసృజన' ప్రోద్బలంతో 'నాబార్డ్' ద్వారా 6 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిందని విని చాలా ఆనందం వేసింది. కష్టపడే వాళ్ళకి తప్పకుండా ఫలితాలు వస్తాయని నిరూపించాడు ధనుంజయ. ఆయన భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఆవిష్కరణలు చేయాలని కోరుకున్నాం.

మర్నాడు ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని 'ఆసు కుటుంబం' గురించి చర్చించుకుంటూ దగ్గరలోని



జలపాతాన్ని చూడటానికి వెళ్ళాం. చిన్న పిల్లలు ఆడుకున్నట్లు అక్కడ ప్రకృతి ఒడిలో ఆడుకున్నాం. ఎన్నో ఫోటోలు తీసుకున్నాం. గణేశం గారు ఒక ఇన్నోవేటర్ టమోటాలలో ఏమాత్రం వృధా పోకుండా అనేక ప్రొడక్టులను తయారు చేసే యంత్రం రూపొందించిన సంగతి చెప్పాడు. ఈ యంత్రం సహాయంతో లక్షల డబ్బు ఆర్జించవచ్చు. ఇలాగే ఎన్నో విషయాల గురించా మాట్లాడుకుంటూ వుంటే అనిపించింది... పట్టుదల అంటూ వుంటే దేవున్ని కూడా ప్రత్యక్షం చేసుకోవచ్చు అని. అందరికీ ఎన్నో అందమైన అనుభవాలు మిగిలాయి. అందరూ అనుకున్నారు ఇకపై ఇటువంటి యాత్ర ఎప్పుడు జరిగినా తప్పకుండా హాజరవ్వాలని.

అక్కడేవున్న రాళ్ళు, కర్రముక్కలతో నేను ఒక పడవ నమూనాను మాటల మధ్యలో తయారు చేశాను. గణేశం గారు చాలా మెచ్చుకున్నారు. నేను చివరిగా అందరి యాత్రీకులనుండి వారి స్పందన వ్రాసిన ఫారంలను సేకరించే కార్యక్రమం పూర్తి చేశాను. యాత్ర పూర్తయింది. ఎన్నో గొప్ప అనుభవాలు మిగిల్చింది. నేను 'మోతుగూడెం'లో 17వ తారీఖు సాయంత్రం 6 గంటలకి భద్రాచలం వెళ్ళే బస్సు ఎక్కి కొత్తగూడెం చేరుకుని రాత్రి 11 గంటలకి హైదరాబాద్ వెళ్ళే రైలెక్కాను.

నేనుయాత్రలో దాదాపు 20మంది కొత్త స్నేహితుల్ని సంపాదించుకోగలిగాను. ఒక గొప్పమనిషి గణేశం గారిని కలిశాను. మాకన్ని ఏర్పాట్లు చేసిన మా సామాన్లు తెచ్చే డ్రైవరు 'తాహిర్ భయ్యా'ను మర్చిపోలేను. నాకీ యాత్ర





గురించి చెప్పిన లెక్చరర్ కవిత గారికి నా ధన్యవాదాలు. హనీబీ, ఎన్.ఐ.ఎఫ్. వారు చేస్తున్న సేవకి నా జోహార్లు.

ఈ యాత్ర తర్వాత నా దృక్పథం మారిందనే చెప్పాలి. ఇప్పుడు ఏదైనా వస్తువునో, యంత్రాన్నో చూస్తే దానిని తయారు చేయటం వెనక ఎంత శ్రమ ఉందోనని ఆలోచిస్తున్నాను. ఏదైనా తయారౌతున్న వస్తువు చూస్తూవుంటే అది తయారయ్యాక ఎంత అందంగా ఉంటుందోనని ఆలోచిస్తున్నాను. పల్లెవాసులంటే గౌరవం పెరిగింది. మన పట్టణావాసుల్లా కాక వారేదీ వృధా చేయకుండా ఎంత పొదుపుగా జీవితం సాగిస్తారో తెలుసుకో గలిగాను. కష్టపడే ప్రతివారు, గ్రామీణ విద్యార్థి అయినా కూడా తప్పకుండా పైకి వస్తాడనే నమ్మకం నాకుంది. మనం పట్టణ వాసులం ప్రకృతి గురించి పట్టించుకోకపోయినా పల్లెవాసులు ప్రకృతిని గౌరవిస్తూ దాంతో సహజీవనం ఎలా సాగిస్తారో తెలుసుకున్నాను. ఈ శోధయాత్ర తర్వాత నాకు కొంచెం విశాల దృక్పథం ఏర్పడిందని ఖచ్చితంగా చెప్పగలను. ఇప్పుడు నేను నా చుట్టూ వున్న మనుషులను, వాళ్ళ మనసులని క్షుణ్ణంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాను. ఈ శోధయాత్రలో నాకు సంక్రమించిన స్ఫూర్తిని నా జీవితాంతం కొనసాగిస్తాను.

**కె. రేవతి, ఎన్.ఐ.టి., వరంగల్ అనుభవాలు :**

2012 జూన్, 15 నుండి 17 వరకు ఖమ్మం జిల్లాలోని 'చింతూరు' నుండి 'మోతుగూడెం' వరకు జరిగిన 4వ చిన్న శోధయాత్రలో నన్నెంతో ప్రభావితం చేసిన విషయాలు చెప్తాను.

❀ ఈ యాత్రలో వివిధ స్థాయిల్లో చదువుకున్న వారు వివిధ వయస్సులవారు, విభిన్న మనస్తత్వాలున్నవారు వున్నా, వారందరినీ కలిపే ఒకేవొక మంత్రం 'ఏదైనా చేద్దాం – కొత్తది తెలుసుకుందాం' అన్న ఆలోచన.

❀ గీసిన అగ్గిపుల్లతో ఏం చేయవచ్చును అని గణేశం గారు అడిగినప్పుడు అబ్దుల్ అనే 4వ తరగతి చదువుకున్న పిల్లవాడు పెన్సిల్ లాగా వాడుకునవచ్చును అని చెప్పినప్పుడు ఆ పిల్లవాడిలో ఎంత ఆలోచనా శక్తివుందో అని ఆశ్చర్యం వేసింది.

❀ 'పోతుపల్లి' గ్రామంలో మొదట గ్రామస్తులు వాళ్ళలో వాళ్ళు మాట్లాడుతూ కూర్చున్నా, మా మాటలు విన్న తర్వాత ఎంత ఉత్సాహంగా మా సంభాషణల్లో పాల్గొన్నారో చూస్తే వాళ్ళకి అర్థమయ్యే భాషలో మనం మాట్లాడితే ఏ విషయమైనా వింటారు అని అనిపించింది.

❀ అదే గ్రామంలో దుర్గ అనే ఒక చిన్న పిల్ల తానొక గాలిమరను తయారు చేసి దాంతో నీటిని పంపు చేస్తాను అని చెప్పినప్పుడు వారెంత ప్రభావితమయ్యారో తెలిసొచ్చింది.

❀ మార్గమధ్యంలో విల్లంబులు ధరించిన కొందరిని చూస్తే ఈరోజుల్లో కూడా జంతువులని వేటాడి బ్రతికేవారున్నారా? అంటే అభివృద్ధి అన్నది ఏకపక్షంగా వున్నదా అన్న అనుమానం కలిగింది.

❀ ఒక ఊళ్ళో రెండు మూడు సంవత్సరాల వయస్సున్న ఒక పాప పొలంలో పని చేసుకుంటున్న తన తండ్రికి తలపైన పెట్టుకొని మధ్యాహ్న భోజనం తీసుకుని వెళ్తూ కనిపించింది. తన కుటుంబ సభ్యుల కోసం ఆ చిన్ని పాప చేస్తున్న సేవ చూస్తే మన పట్టణ జీవితంలో ఇటువంటి సందర్భాలుంటాయా? అన్న ఆలోచన వచ్చింది.



❀ ఒక గ్రామంలో గ్రామస్తులు భూమి పూజ చేసుకుంటూ వుంటే ఎందుకు? ఏమిటి? అని అడిగితే వారు భూమితల్లి మనకు ఇన్ని ఇచ్చింది. దానికి మనం కృతజ్ఞతగా ఆ తల్లికి, వానదేవుడికి పూజ చేస్తున్నాం అని చెప్పినపుడు ఎంత గొప్ప పవిత్రమైన ఆలోచన అనిపించింది.

❀ దిబ్బగూడెంలో కొండజాతి స్త్రీలు నృత్యం చేస్తూవుండటం చూశాం. వాళ్ళ ఆనందం, బాధ, సంతోషం మొదలైన భావాలు వ్యక్తం చేసుకోవటానికి వారికి పాటలు, నృత్యాలే మాధ్యమాలు అని తెలుసుకొని ఆశ్చర్యపోయాం.

❀ ఒక గ్రామంలో ఆదివారం ఉదయం చిన్నపిల్లలు 'ఉడుమాలు' పట్టుకొని వాటిని అమ్మి తల్లిదండ్రులకి చేదోడుగా ఉంటామని చెప్పినప్పటి సంఘటన మన పట్టణంలో పిల్లలు పాకెట్ మనీకై పెట్టే పేచీతో పోల్చి చూసేలా చేసింది.

❀ ప్రతిసారీ శోధయాత్రలో ఏదో కొత్తది నేర్చుకునే అవకాశం వుంటుందని తెలిసొచ్చింది. గ్రామస్తులని, వారి జీవన విధానాన్ని చూస్తుంటే మన అంతరంగాలని తరచి చూడాలనిపించింది. ప్రకృతితో సహజీవనం చేయటం, దానిని రక్షించుకోవటం మన బాధ్యత. దానిని రక్షిస్తే అది మనల్ని కాపాడుతుంది.

**కె. వినీత్, ఇంటర్ విద్యార్థి, ఆగాఖాన్ అకాడమీ స్పందన:**

నిజమైన గ్రామీణ భారతం జీవన విధానం చూసే అవకాశం దొరికింది. మన పట్టణవాసులకన్నా పల్లెవాసులే జీవితాన్ని బాగా అర్థం చేసుకొని ప్రకృతితో పోరాడకుండా దాంతో సహజీవనం చేస్తున్నారు. అందుకే వారు ఆనందంగా ఆరోగ్యంగా వున్నారు. వారికన్నా మనమెంతో వెనకబడి వున్నామనిపించింది.

❀ నలుగుర్నీ కలవటం, స్నేహం చేయటం, మాట్లాడటం ఎలాగో నేర్చుకున్నాను.

❀ మనదేశంలోని పల్లెలు జ్ఞానాన్ని పంచే ఆలయాలు అనిపించింది.

❀ అభివృద్ధి అంటే మంచి వసతులు, 5 నక్షత్రాల వసతులున్న హోటళ్ళు కాదు, అందరూ కలిసి ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ, ఒకరిమీద ఒకరు ఆధారపడుతూ సహజీవనం చేయటమే అనిపించింది.

**యం.యస్. తరుణ్, నారాయణ కాలేజ్, హైదరాబాద్ స్పందన:**

❀ ఈ శోధయాత్రలో ఎంత నేర్చుకోవచ్చునని వెళ్ళానో దానికన్నా ఎన్నో వంతులు ఎక్కువ నేర్చుకుని వచ్చాను.

❀ ప్రకృతి గొప్పతనం, అది మనకెంత సహాయం చేస్తుందో అర్థం చేసుకున్నాను.

❀ గ్రామస్తులు మనకన్నా తెలివైన వారని, నిష్కల్మష హృదయం కలవారని, వారిలా జీవించడంలోనే ఆనందముందని నాకు తెలిసొచ్చింది శోధయాత్రలో.

**అఖిల, నారాయణ కాలేజ్, హైదరాబాద్ స్పందన:**

❀ ఈ శోధయాత్ర మొదటి రోజున మేము తలమీద బరువు మోసే వారికి మెడ కుదించుకు పోకుండా వుండటానికి గుజరాత్‌లో ఒక స్టాండు కనిపెట్టినారని చెప్పినప్పుడు రుక్మిణి అనే అమ్మాయి ఆ స్టాండు గురించి ఉత్సాహంగా, ఉత్సుకతతో వివరాలు అడుగుతూ వుంటే అనిపించింది... ఆమె తన తోటి మహిళలు తలమీద బరువును మోస్తూవుంటే వారికి సహాయం చేద్దామన్న భావన ఆమెలో ఎంతవుందో తెలిసింది.

– మోతుగూడెంలో మేము 'ముత్తు' అనే చిన్న పిల్లవాడిని కలిశాము. అతను పెద్దయ్యాక ఇంజనీర్ అవ్వాలని కోరిక వెలిబుచ్చినప్పుడు మాకు ముందు కొంచెం ఆశ్చర్యము, తర్వాత చాలా ఆనందం కలిగింది. అతనికి మా యాత్రీకుల తరుపున చేతనైన సహాయం చేస్తామని మాట ఇచ్చాము.

– మొత్తం ఈ యాత్రలోని నా అనుభవాలు నామీద జీవితంలో మర్చిపోలేని ముద్రనే వేశాయి. పల్లెవాసుల జీవన విధానం నన్నెంతో అబ్బురపరిచింది. వాళ్ళు, వాళ్ళ జీవన విధానంలో మన పట్టణవాసులకన్నా ఎంతో మెరుగైన పద్ధతులను వారు వాడుతున్నారని నాకనిపించింది. వాళ్ళ చుట్టూవున్న కొద్దిపాటి వనరులైనా చాలా జాగ్రత్తగా వాడుతూ వుంటే వారి దగ్గరనుంచి మనం నేర్చుకోవలసింది చాలా వుంది అనిపించింది. మారుమూల ప్రాంత పల్లెల్లోని జనుల జీవన విధానము దగ్గరనుంచి చూసే అవకాశం కల్పించిన ఈ శోధయాత్రకి, దాన్ని నిర్వహించిన బ్రిగేడియర్ గణేశం గారికి, ఈ సందర్భంలో అందరి పట్ల స్నేహ భావం ప్రకటించిన నా తోటి యాత్రీకులందరికి నా ధన్యవాదాలు.





# ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు



5306

## పశువులలో కడుపుబ్బటం వ్యాధి నివారణ:

పశువులు పచ్చిగడ్డి, పచ్చి జొన్నలు, ఆముదపు ఆకులు ఎక్కువగా తినటం వలన కడుపు ఉబ్బిపోయి వ్యాధిన పడతాయి. దీని నివారణకై గుజరాత్ లోని భారూచ్ జిల్లాకు చెందిన 'ఫాతూ భాయ్ రేషంగ్ భాయ్ తాడి', అలాగే భావ్‌నగర్ జిల్లాకు చెందిన 'కిశోర్‌భాయ్ సుఖదేవ్‌సింగ్ గోయల్' లు ఈ క్రింది ఔషధాన్ని తయారు చేసి వాడుతుంటారు. వారు 200 గ్రా. ఇప్ప పూలని పొడిగా చేసి, దానిలో 100 గ్రా. బెల్లం కలిపి, చిన్న గుళికలుగా చేసి రోజుకు రెండుసార్లు రెండు రోజులపాటు పశువుకు తినిపిస్తారు. దానితో మంచి గుణం వుంటుంది అంటున్నారు. ఆ ప్రాంతంలో దాదాపు 25 శాతం మంది రైతులు గత 20 సంవత్సరాలుగా ఇదే పద్ధతిని వాడుతున్నారట.

5307

## ఎద్దులలో కొమ్ము పుచ్చిపోయే వ్యాధికి ఔషధం:

ఎద్దులకి కొమ్ములు పుచ్చిపోవడం అప్పుడప్పుడూ జరుగుతూ వుంటుంది. కొమ్ము కొద్దిగా వంగిపోవటం దీని మొదటి లక్షణం. తరువాత దశలో అది పుండుగా మారి చీము పట్టి చాలా ఇబ్బంది పెడుతుంది. అప్పుడు కొమ్ముని ఒక రంపంతో నాలుగు సెంటీమీటర్ల ముక్క మిగిలేలా కోసేస్తారు. కోసిన వెంటనే 100 గ్రా. ఆముదాన్ని ఆ భాగంలో పూస్తారు. గుజరాత్ లోని మహాసేన జిల్లాకు చెందిన 'కాలాభాయ్ కూరాభాయ్ దేశాయ్' మరియు 'మూలాభాయ్ హెచ్. పటేల్' లు 50 గ్రా. నేల వావిలాకు కు 50 గ్రా. యూరియాను కలిపి కొమ్మును కోసిన ప్రాంతంలో కట్టు కడతారు. దానితో ఒక వారంలో పశువు ఉపశమనం పొందుతుంది. ఈ చిట్కాను కాలాభాయ్ రాజస్థాన్ లోని శిరోహి జిల్లాకు చెందిన శ్రీ ఊకాభాయ్ రభీ వద్దనుండి 30 సంవత్సరాల క్రితం నేర్చుకున్నారట.



మెహసనా జిల్లా లోని కాన్సా గ్రామంలో రైతులు ఆముదంతో పాటు జుట్టును పెట్టి కట్టు కడతారట. కొన్నిసార్లు వారు కట్టుని బట్టతో కాక, తోలుతో కడతారట. వారు చెప్పినదాని ప్రకారం ఇలా కట్టును రెండుమూడు సార్లు కడితే గాయం నయమౌతుందట.

5401.2

## రసం పీల్చే పురుగు నివారణకు నిమ్మరసం:

అన్ని ప్రాంతాల్లో మాదిరిగానే రసం పీల్చే పురుగు బెడద గుజరాత్‌లోని సురేంద్రనగర్‌లో కూడా ఉంది. అక్కడి రైతులు వర్షాకాలంలో మాత్రం ఈ బెడద వుండదు అంటారు. ఈ రసం పీల్చే పురుగు 4 నెలల ప్రత్తి పంటను ఆశించి ఆకుల క్రింద చేరి రసం పీలుస్తూ వుంటాయి. ఇవి ఆశించినపుడు ఆకులు నల్లగా జిగటగా మారిపోతాయి. సాధారణంగా ఈ పురుగులు పసుపు పచ్చ మరియు ఆకుపచ్చ రంగుల్లో వుంటాయి. సరియైన చర్యలు తీసుకోకపోతే పంట మొత్తం నాశనమై పోతుంది. స్థానికంగా దొరికే పత్తి విత్తనాలు వేసినపుడు ఈ సమస్య తక్కువగా వుంటుంది అని అక్కడివారంటారు.

సురేంద్రనగర్‌కు చెందిన సామంత్‌భాయ్ ధరమ్‌సింగ్ భాయ్ ధోలాకియా ఈ పురుగులకు విరుగుడుగా 'నిమ్మరసం'



వాడితే ఎలా వుంటుంది అని ఆలోచించారు. ఈయన దాదాపు 100 నుండి 200 మి.లీ. నిమ్మరసాన్ని 15 లీటర్ల నీటిలో కలిపి వారానికి ఒకసారి వంతున మూడుసార్లు తన పంటపై పిచికారీ చేసి విజయవంతంగా అరికట్ట గలిగాడు.

**5403**

## ఎండుగడ్డి పురుగు పట్టకుండా నివారణకు :

రైతులు సరియైన ప్రదేశం దొరకనపుడు ఆరుబయటే ఎండుగడ్డిని కుప్పగా వేసి నిలువ చేస్తారు. ఉత్తర గుజరాత్ ప్రాంతంలోని రైతులు జొన్నలు, సజ్జల చొప్పను ఒక అందమైన ఆకృతిలో పేర్చి (వాముగా) వుంచటం ద్వారా నీరు పైన నిలువకుండా త్వరగా జారిపోతుంది. స్థానికంగా దీన్ని 'అనంగళి' అంటారు. (మనం పొట్టువాములు అటాము). ఈ



అమరికలో చొప్పను నిటారుగా పేర్చటం వలన నీరు ఇంకిపోయే సమయం లోపలే జారిపోతుంది. కొన్నిసార్లు సజ్జల పొట్టును అదనపు రక్షణగా పై భాగంలో పోస్తారు. దీనివల్ల వర్షం నుంచి రక్షించుకోగలిగినా, భూమి నుండి కూడా పురుగులు పట్టే అవకాశం వుంటుంది. దీనికి వారు బూడిదను, ఉప్పును కలిపి నేలపైన పరిచి ఆ తరువాత దానిపైన వాముగా పేరుస్తారు. పేర్చేటపుడు వరుసల మధ్య కూడా ఉప్పును చల్లుతారు. అక్కడి రైతులు చెప్పినదాని ప్రకారం ఎండుగడ్డిని రక్షించుకోవటానికి ఇంతకన్నా మంచి ఉపాయం లేదు. అక్కడందరూ ఇదే పద్ధతిని ఉపయోగిస్తారు.

**6105**

## గాలికుంటు వ్యాధి కి చికిత్స:

పశువులలో వర్షాకాలంలో ఎక్కువగా గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి కేవలం కాళ్ళకే పరిమితమైతే పశువు కుంటిదైపోతుంది. కానీ సాధారణంగా కాళ్ళతో పాటు మూతికి కూడా వ్యాప్తి చెందుతుంది. ఇది సోకిన పశువులు మేత తినటం మానేసి, సొల్లు కారుస్తూ నీరసంగా వుండి పాల దిగుబడి కూడా 70 శాతం వరకు పడిపోతుంది. సరియైన సమయంలో నివారణ చర్యలు తీసుకోకపోతే ఒకటి రెండు పశువులు వున్న చిన్నరైతులకి చాలా నష్టం చేకూరుతుంది.

గుజరాత్ రాష్ట్రనికి చెందిన భావ్‌నగర్ జిల్లాలోని సతాభాయ్ సంగ్రామ్‌భాయ్ సమద్ దీనికి విరుగుడుగా



గాడిదగడపాకు ను ఉపయోగిస్తాడు. ఈ ఆకును ముద్దగా చేసి వ్యాధి సోకిన గిట్టలకి పట్టిస్తాడు. ఇలా రోజుకి రెండుసార్లు వ్యాధి నయమయ్యేంత వరకు చేస్తాడు. ఆ ప్రాంతంలోని రైతులు ఈ ఆకుని ధాన్యం నిలువ చేసేటపుడు, పొలాలలో క్రిములను చంపటానికి కూడా వాడుతూ వుంటారు. ఈ ఆకు సాధారణంగా అన్ని ప్రాంతాల్లో దొరికినా దీని వాడకం మాత్రం వారి వారి అవసరాలను బట్టి మారుతూ వస్తోంది.

**6202**

## కొబ్బరి అధిక దిగుబడికి :

కొన్ని సమయాలలో సంవత్సరాలు పెరిగే కొద్దీ కొబ్బరి చెట్లు ఎదుగుతాయే తప్ప కాయలు కాయవు. గుజరాత్ లోని వల్సాద్ జిల్లాకు చెందిన 50 సంవత్సరాల జారా బెహన్ దూదా ఒక భూమిలేని ఇల్లాలు. ఆమెవద్ద ఇటువంటి చెట్టు ఒకటుంది. ఆమెకి ఎవరో చెప్పారట... చెట్టులో ఒక మేకు దిగకొడితే కాయలు కాస్తాయని! ఆమె 0.5 సెం.మీ. లావు 4 నుండి 6 సెం.మీ. పొడవున్న ఒక మేకును భూమినుండి ఒకటిన్న మీటర్ల ఎత్తులో చెట్టుకు దిగకొట్టింది. తర్వాత కొంత కాలానికి చెట్టు ఆకులు విస్తరించడం తగ్గిపోయి క్రమంగా కాయలు కాయటం ప్రారంభించింది. ఆమె చెప్పిన దాని ప్రకారం ఆ ప్రాంతంలో ఇది చాలా అరుదైన పద్ధతి. కానీ ఇతర ప్రాంతాల్లో పొప్పాయి చెట్లకి ఈ పద్ధతిని ఉపయోగించటం సాధారణంగా జరుగు తుంది



నౌసారి లోని యాస్పి కాలేజ్ ఆఫ్ ఫారెస్ట్రీ & హార్టికల్చర్ లోని శాస్త్రవేత్త డా. యస్.కె. ధావే ఈ పద్ధతి రెండు విధాలుగా పని చేస్తుండవచ్చు అంటారు. ఒకటి .... ఆ ప్రాంతంలో వున్న నల్లరేగడి భూమిలో ఇనుము తక్కువగా వుండటం వలన ఈ ఇనుప మేకు దానిని భర్తీ చేస్తూ వుండవచ్చు. రెండు.... అక్కడి భూమిలో నత్రజని ఎక్కువగా వుండటం వలన 'సి:ఎన్' సమతులనం సరిగా లేక ఈ మేకు వలన అవి సరిపడే అవకాశముంది అంటారు.

**6203**

## చేపలు పట్టడానికి విచిత్రమైన పద్ధతి :

సాధారణంగా చేపలు పట్టడానికి మనకు తెలిసిన పద్ధతులు వాడుతూ వుంటాము. కానీ గుజరాత్ లోని వల్సాద్ జిల్లాకు చెందిన 'వాషి గిరీష్ కుమార్ రాంచోడాజీ' ఈ ప్రత్యేకమైన పద్ధతిని వాడుతూ వుంటారు. ఆయన నేలమర్రి ఆకులను ఎండబెట్టి దాదాపు 100 నుంచి 200 గ్రా. ఆకులను పొడిచేసి ఒక బట్టలో మూటగా కట్టి అటువంటి నాలుగైదు మూటలను చెరువులో చాపలు దొరికే ప్రదేశంలో నీటిలో మునిగేలా వుంచుతాడు. ఒక అరగంట తర్వాత ఆ ప్రాంతంలోని చేపలు ఈ ఆకు ప్రభావం వలన స్పృహ కోల్పోయి తేలుతూ నీటిపైకి వచ్చేస్తాయి. అప్పుడు వాటిని ఈయన వలతో సులువుగా పట్టేస్తాడు. సాధారణంగా ఆయన ఈ పద్ధతిని నిలువ వున్న నీటిలో, మెల్లగా పారే యేటిలో వాడతాడు.

ఆయన ఈ చిట్కాను ధంగ్ జిల్లాలోని గిరిజన వాసుల వద్దనుండి నేర్చుకున్నాడు. మొదట్లో ఈ ఆకులని అక్కడినుంచే తెచ్చుకునేవాడు. తర్వాత భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తానే కొన్ని విత్తనాలు తెచ్చి మొక్కలు నాటి తానే పెంచసాగాడు.



# 'హనీబీఏపి' ప్రగతి

'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. 2007లో శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఏపిలో చేరడంలో ఉద్యమ ప్రగతి మరింత ఊపునందుకొంది. 2010లో శ్రీ జమ్మలమడక శ్రీకర్ గారి ఆగమనంతో ప్రభుత్వ సంస్థలతో హనీబీఏపి అనుసంధానం ఇంకా బాగా పుంజుకొంది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ ఆరేళ్ళలో 'హనీబీఏపి' పునాదులను పటిష్టం చేశాయి.

**ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు :**

✤ 98 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

✤ ఆరుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ ఇప్పటి వరకు 18 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.

✤ పంతొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఇన్నోవేషన్లను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్ మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.

✤ 2006 నుండి 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురించటం, ఆరవ సంవత్సరం నుండి దీన్ని ద్వైమాసిక పత్రికగా మార్చటం.

✤ దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో 14–20 మార్చి, 2010 జరిగిన 'ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ గార్లు పాల్గొనడం.

✤ మే 25, 2011న నాబార్డు సంస్థలో తొమ్మిది మంది ఇన్నోవేటర్లు చర్చలు జరిపారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ లోని నాబార్డు సంస్థ, హనీబీఏపిల పరస్పర ప్రయత్నంతో జరిగింది. ఆర్థిక సహాయంతో ఈ ఇన్నోవేషన్లను సామాజికాభి వృద్ధికై మార్కెట్ చేయాలని నాబార్డు సంస్థ నిర్ణయించింది.

✤ 'పల్లెసృజన' ద్వారా గుంటూరు జిల్లావాసి సయ్యద్ సుభాని సృష్టించిన 'బూమ్ స్ప్రేయర్'ను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు 2012లో రికార్డుగా నమోదు చేయడమైనది.

✤ దూరదర్శన్ వారు జనవరి 2012 నుండి ప్రతినెలా నాలుగవ గురువారం రాత్రి 8 గంటలకు 'సప్తగిరి' ఛానల్‌లో 'సృజన' కార్యక్రమం ద్వారా ఇన్నోవేటర్లను పరిచయం చేయడం.

✤ అయిదవ జాతీయ పోటీల్లో బోయ రాజన్న, భూమయ్యాచారి, నజీర్ అహమ్మద్‌లకు జాతీయ బహుమతులు మార్చి 2012లో ప్రదానం. మా చిన్న కలలు నిజం కావడం.

✤ గోదాసు నర్సింహ గుర్రపుడెక్క యంత్రాన్ని ఉపయోగించ డానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ముందుకు రావడం, 50 లక్షల రూపాయల ఆర్డరు ఇవ్వడం.

✤ శాంసంగ్ ఇన్నోవేషన్ కోషియంట్ 2011 జాతీయ పోటీల్లో 'మల్లేశం' గారికి, 2012 పోటీల్లో 'గురవయ్య' గారికి దేశ స్థాయిలో రెండవ బహుమతి రావటం.

✤ ఐదుగురు ఐఐటి, ఖరగ్‌పూర్ విద్యార్థులు ముగ్గురు గ్రామీణ ఇన్నోవేటర్ల వద్ద ప్రాజెక్ట్ ఇంటర్న్‌షిప్ చేయటం.

**మా కలలు :**

✤ ఎనిమిదవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం ఆరుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

✤ 'పల్లెసృజన సభ్యత్వాన్ని 10వేలకు పెంచడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో–ఆర్డినేటర్, హనీబీఏపి, ఫోన్ : 98660 01678.

## ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్

# ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి

### వేర్ దేర్ ఈజ్ నో డాక్టర్

**పాఠకులకు నమస్సులు....**

- "వేర్ దేర్ ఈజ్ నో డాక్టర్" ఒక పుస్తకం.
- ఆరోగ్యాన్ని గురించి అవగాహన కలిగించుటకు అభివృద్ధి చెందుతున్న దేశాలలో విస్తృతంగా ఉపయోగించిన పుస్తకం.
- ఈ పుస్తకాన్ని మొట్టమొదట స్పానిష్ భాషలో 'డొండెనో హే డాక్టర్' అనే పేరుతో 1970లో ప్రచురించారు.
- ఈ పుస్తకం "డేవిడ్ వెర్నర్" అనుభవాలతో రాశారు. హెస్పేరియన్ ఫౌండేషన్ ప్రచురించింది.
- ఈ పుస్తకం తెలుగులో "వైద్యుడు లేని చోట" అనే పేరుతో ప్రచురితమయింది.
- ఈ పుస్తకం దాదాపు 100 భాషల్లోకి అనువదించ బడింది.
- ఇప్పటికి దాదాపు 10 లక్షల పుస్తకాలు అమ్ముడు పోయాయి.
- ఈ పుస్తకం చాలా సులభ పద్ధతిలో వివిధ ఆరోగ్య సమస్యలకు సొంత రక్షణ గురించి విశదీకరించింది. పరిశుభ్రత, టీకాలు, ఆహారాన్ని గురించి ప్రస్తావించింది
- ఒకప్పుడు ఈ పుస్తకం అభివృద్ధి చెందుతున్న దేశాలలో చాలా ఆసుపత్రులలో లభించేది.
- ఒక సాధారణ ఆరోగ్య కార్యకర్తకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగ పడుతుంది.
- సాధారణ ప్రజలు కూడా ఈ పుస్తకం చదివితే ఎంతో మంచిది.
- తెలుగు పుస్తకం సాధారణంగా విశాలాంధ్ర, ప్రజాశక్తి పుస్తకాల షాపులలో దొరుకుతుంది.
- 'వైద్యుడు లేనిచోట' చదవండి – చదివించండి.

### వానల్లో ఆరోగ్యం

- వానాకాలం నీటి కాలుష్యం ప్రధాన సమస్య, నీటి కాలుష్యం వల్ల నీళ్ళ విరేచనాలు, కలరా, చీము – రక్త విరేచనాలు, అమీబియాసిస్, కొన్ని రకాల పచ్చ కామెర్లు, టైఫాయిడ్, పోలియో, నులిపురుగు వ్యాధులు రావచ్చు.
- నీటి గుంటలలో దోమలు పెరిగి, దోమల వల్ల మలేరియా, డెంగీ జ్వరం, మెదడు వాపు, చికున్ గున్యా, బోదవ్యాధి రావచ్చు.
- తాగు నీటిని బాగా వడకట్టి, మరగకాచి, చల్లార్చి తాగండి.
- మీ ఊరిలో ఆరోగ్య కార్యకర్త సహాయంతో మంచినీటి వనరులను బ్లీచింగ్ పౌడరుతో రక్షించండి.
- ఆరోగ్య కార్యకర్తల దగ్గరనుండి క్లోరిన్ మాత్రలు ఇప్పించుకొని వారి సలహా ప్రకారం నీటి రక్షణ చేసుకొనండి.
- శుభ్రత పాటించని హోటల్లలో ఆహారం తినకండి.
- ఆహారం తినేముందు, మల విసర్జన తర్వాత చేతులు సబ్బు మరియు నీటితో శుభ్రం చేసుకొనండి.
- దోమలు అభివృద్ధి చెందకుండా నీటిగుంటలపై కిరోసిన్ లాంటి పదార్థాలు చల్లండి.
- దోమతెరలు వాడండి.
- వారానికొకరోజు అన్ని పాత్రలలో నీరు తొలగించండి. దీనినే డ్రైడే పాటించటం అంటారు.
- వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించండి.
- బహిరంగ ప్రదేశాలలో మల విసర్జన, మూత్ర విసర్జన చేయకండి. వ్యర్ధ పదార్థాలను పరిశుభ్రంగా రక్షితంగా పారవేయండి.

### న్యుమోనియా - నీళ్ళ విరేచనాలపై యునిసెఫ్ నివేదికలోని ముఖ్యాంశాలు

- ఇటీవల యునిసెఫ్ న్యుమోనియా మరియు నీళ్ళ విరేచనాలపై ఒక నివేదిక విడుదల చేసింది.
- ప్రపంచ వ్యాప్తంగా ఈ రెండు జబ్బులతో ఏటా 20 లక్షల మంది పేద పిల్లలు చనిపోతున్నారు.
- మనదేశంలో ఈ రెండు జబ్బులతో ఏటా 6 లక్షల మంది పిలలు చనిపోతున్నారు.
- 5 సంవత్సరాల లోపు పిల్లలలో జరిగే మరణాలలో 29 శాతం ఈ రెండు జబ్బులతోనే.

- ఈ మరణాలు ఎక్కువగా మనదేశంలో, నైజీరియాలో, డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో, పాకిస్తాన్ మరియు ఇథియోపియాలో జరుగుచున్నవి.
- ఈ జబ్బులు రక్షిత నీరు, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, టీకాలు, ఆహార సరఫరాకు సంబంధించినవి.
- ప్రపంచ వ్యాప్తంగా 783 మిలియన్ల ప్రజలకు రక్షిత నీరు లేదు. 2.5 మిలియన్ల ప్రజలకు పారిశుధ్య వసతులు లేవు. 1.1 బిలియన్ల ప్రజలు బహిరంగ మల విసర్జన చేస్తున్నారు.
- ఈ జబ్బులు కొన్ని జాగ్రత్తలతో నిరోధించవచ్చు.
  - ◆ చిన్న పిల్లలకు తల్లిపాలు పట్టండి.
  - ◆ కాచి చల్లార్చిన నీరే త్రాగండి.
  - ◆ ఆహారం తినేముందు, మల విసర్జన తర్వాత చేతులు సబ్బు మరియు నీటితో కడగండి.
  - ◆ సకాలంలో టీకాలు వేయించండి.
  - ◆ న్యుమోనియాకు ఆంటిబయాటిక్స్ అందుబాటులో ఉంచండి.
  - ◆ నీళ్ళ విరేచనాలు వచ్చిన పిల్లలకు ఆరోగ్య కార్యకర్త సలహాతో పాటు నీరు మరియు లవణముల చికిత్స చేయండి.

## వైద్యరంగంలో మహానుభావులు-7 - హిప్పోక్రేటిస్

- ఆధునిక వైద్య శాస్త్ర పితామహుడు హిప్పోక్రేటిస్
- హిప్పోక్రేటిస్ గ్రీకువైద్యుడు. క్రీ.పూ. 460 లో జన్మించాడు.
- ఆధునిక వైద్యులు చేసే హిప్పోక్రేటిస్ ప్రతిజ్ఞ - హిప్పోక్రేటిస్ ప్రతిపాదించినదే.
- జబ్బులు, దయ్యాల వల్ల, భూతాల వల్ల రావు అని ఖరాఖండిగా చెప్పిన వ్యక్తి హిప్పోక్రేటిస్.
- వ్యాధులు ఎక్కువగా వాతావరణం ప్రభావంతో ఆహారపు అలవాట్లతో, జీవన విధానంతో వస్తాయని హిప్పోక్రేటిస్ నమ్మకం.
- రోగుల పట్ల ప్రేమ, సున్నితంగా వైద్య ప్రక్రియలు నిర్వహించుట. వైద్యంలో పరిశుభ్రత పాటించుట, వ్యాధుల నివారణలో ఎంతో ముఖ్యం అంటారు హిప్పోక్రేటిస్.
- హిప్పోక్రేటిక్ వైద్యంలో మందులు ఎక్కువగా వాడరాదు అనే పద్ధతి పాటించారు.
- జబ్బు ఏదో తెలుసుకునే దానికంటే ముందు జబ్బుతో ఉన్న వ్యక్తి ఎలాంటి వారో తెలుసుకోవడం ముఖ్యం అంటారు హిప్పోక్రేటిస్.
- "రెండు విషయాలు నేర్చుకోండి. సహాయం చెయ్యడం, అపకారం చెయ్యకుండా ఉండడం" అంటారు హిప్పోక్రేటిస్
- హిప్పోక్రేటిస్ కార్పస్ అనే వైద్య గ్రంథాలు ఆ రోజుల్లో చాలా ప్రముఖంగా ప్రచారంలో ఉన్నవి.

## ఎక్స్‌రేలు- తెలుసుకోవలసిన విషయాలు

- ఇప్పుడు ఎక్స్‌రే గురించి మనలో తెలియనివారు లేరు.
- ఎక్స్‌రేలను క్రీ.శ. 1895లో రాంట్‌జెన్ అనే శాస్త్రవేత్త కనిపెట్టాడు.
- రోగ నిర్ధారణలో ఎక్స్‌రేలు ఉపయోగిస్తారు. ఎక్స్‌రేల సహాయంతో ఇప్పుడు స్కానింగ్ అనే పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.
- కేన్సర్ వ్యాధి నిర్ధారణకు, కేన్సర్ వ్యాధి వైద్యానికి ఎక్స్‌రేల ఉపయోగం ఉంది. ఎక్స్‌రేల వల్లే కేన్సర్ వ్యాధి రావచ్చు కూడా!
- ఎక్స్‌రేల వల్ల కంటి శుక్లం, పిల్లలు కలగకపోవుట, పుట్టుకతో అంగవైకల్యం రావచ్చు.
- ఏ రోగికైనా ఎక్స్‌రేలు ఉపయోగించకుండా రోగాన్ని నిర్ణయించగలిగినప్పుడు ఎక్స్‌రేలు తీయరాదు.
- గర్భిణీ స్త్రీలకు ఎక్స్‌రేలు తీయుట చాలా వరకు మానాలి.
- 1895 ప్రాంతంలో ఎక్స్‌రేలు కనిపెట్టినప్పుడు ప్రమాదాల గురించి తెలియక ఎక్స్‌రేలు బాగా వాడారట! ఈ మధ్యకాలంలో పెరుగుతున్న వైద్య వ్యాపారం వల్ల ఎక్స్‌రేలు ఎక్కువగా వాడుతున్నారు.
- లాభ నష్టాలు బేరీజు వేసుకొని, ఎక్స్‌రేలు ఉపయోగించడం శాస్త్రీయం మరియు ఇంగిత జ్ఞానం.

ఈ అంశాలు ఒక నోటుపుస్తకంలో రాసిపెట్టండి, మీస్నేహితులతో, బంధువులతో,సహచరులతో మాట్లాడండి. వారికి పోస్టుకార్డులపై రాసి తెలపండి.

**- సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ..**

**డా. అరవీటి రామ యోగయ్య, ఓపియస్‌డిహెచ్.**

**ఫోన్ : 98496 69282**

# స్పందన

బ్రిగేడియర్ గణేశం గార్కి,

సాదర నమస్కారములు. మీరు సహృదయంతో పంపిన మే-జూన్ 2012 'పల్లెసృజన' అందింది. కృతజ్ఞతలు. మామూలుగానే ఆ ప్రతి డా. ఆచంట లక్ష్మీపతి ఆయుర్వేద గ్రంథాలయంలో భద్రపరచబడుతుంది.

పత్రిక ఆసక్తితో చదివిన తర్వాత కొన్ని విషయాలు వ్రాయాలనిపించింది. మీ వీలును బట్టి చేయ ప్రార్థన. నాకు ఆయుర్వేదంపై మక్కువ కనుక ఆ సంబంధిత విషయాలు ముందు ప్రస్తావిస్తాను.

1. లస్సీబేన్ వ్యాసంలోని విషయాలన్నీ చాలా సులభంగా అవలంభించదగినవి. వీటిని బాగా ప్రాచుర్యం చేయాలి.

2. ఇతర రాష్ట్రాల కబుర్ల వ్యాసంలో పేర్కొన్న చెట్లను ఆ పేర్లతో ఇక్కడ గుర్తించడం కష్టం. నారచెట్టు, కొండవరగు ఏమో తెలియదు. అట్లాగే పరికి/ పరిమి/ కోరింతలు. వీటి బొటానికల్ పేర్లు ఇస్తే చాలా చాలా ఉపయోగంగా వుంటుంది. కోరింత చెట్టు బొటానికల్ పేరు అకేషియా టోర్టా. దీనికి బాగా పీచు ఉంటుంది. దీనికి ముళ్ళుంటాయి. దీని నార తాడుగా పేని మెడలో ధరిస్తే కోరింత దగ్గు తగ్గుతుంది. అందుకే దీనికాపేరు వచ్చింది. దానిని త్రాగినా కోరింత దగ్గు తగ్గుతుంది. పత్రికలో వ్రాసిన కోరింత ఈ కోరింత ఒకటా కాదా అనేది నిర్ణయించాలి. దీనికి పరికి/ పరిమి అనే పేర్లున్నట్లు తెలియదు. ప్రాంతీయమేమో?

3. దాహం తీరడానికి ధాతికి అనే చెట్టు ఉపయోగిస్తుందని వ్రాశారు. ఆ పేరు ధాతకి అయి వుండాలి. దీని బొటానికల్ పేరు ఉడ్‌ఫోర్డియా ఫ్రూటికోసా. దీన్ని ఆరెచెట్టని తెలుగు పేరు. కాని జేగురు, సేరింగి, పగిడం అనే పేర్లు ఎక్కడా వున్నట్లు చదవలేదు. ఇవి కూడా ప్రాంతీయాలేమో?

4. నాగదొండ ఇదమిత్థంగా తెలియాలి. కారణం - దొండ, చేదు దొండ, ఆదొండ, కాకిదొండ, ఆరెదొండ, లింగదొండ, మురుదొండ అనే పేర్లు కన్పిస్తాయి.

5. చిట్టి చొన్నలంటే పచ్చజొన్నలా?

6. గులివిడి మొక్క, గొలిమిడి లేక నేల గొలిమిడి మొక్కలు పొలాల్లో కలుపు మొక్కలుగా మొలుస్తాయి. చేదుగా వుంటుంది. జ్వరాలకు చక్కని మందు. దీని బొటానికల్ పేరు ఎనికోస్టెమ్మా లిట్టిరోల్. చేదు రుచికలది కనుక ధాన్యం నిలువ చేయడానికి ఉపయోగించవచ్చు.

7. ఆకులు కాల్చిన బూడిద చల్లదనం అనే ప్రక్రియ వృక్షాయుర్వేదంలో సూచన ప్రాయంగా చెప్పబడింది. కనుక శాస్త్రీయమే!

8. అట్లాగే ఆకులు మొదలైనవి కుళ్ళబెట్టిన నీరు వృక్షాయుర్వేదంలో కుణపజలంగా చెప్పబడింది. ఇది చాలా చాలా ఉపయోగకరమైనది. ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయం చేసేవారు కొందరు అవలంభిస్తున్నట్లుగా తెలిసింది.

9. కంపు రొడ్డ, పులికంప, అక్షింతపూల చెట్లు బొటానికల్‌గా తెలియాలి.

10. జర్మనీ వారికి మీరు సూచన చేసిన చిట్కాలలో శ్రీశైలం ఏమిటో తెలియలేదు.

11. వృక్షాయుర్వేదంలో చిమటలు, ఎలుకలు, మిడతలు, చెదలకు ఒక మంత్రం చెప్పబడింది. దానిని ఆకుపై వ్రాసి మంత్రం జపిస్తూ ఆ ఆకును భూమిలో పాతిపెట్టాలట.

ఇటువంటివి ఎన్నో వృక్షాయుర్వేదంలో చెప్పబడ్డాయి. వాటిని ప్రాచుర్యం చేస్తే బాగుంటుంది. వ్యవసాయానికి చెందిన చాలా విషయాలు (అగ్రికల్చరల్ ఆస్ట్రాలజీ) 'రెట్టమత శాస్త్రం'లో ఉన్నాయి. ఒకసారి చూడండి. పునః నమస్కారాలతో....

**– <u>వైద్య పమ్మి సత్యనారాయణ శాస్త్రి</u>,** హరిత ఆయుర్వేద కేంద్రం, విజయవాడ. ఫోన్ : 9441 16655

శాస్త్రిగారూ,

మీరు పంపిన విలువైన సమాచారాన్ని పాఠకుల దృష్టికి తీసుకు రావటానికి 'పల్లెసృజన'లో ప్రచురిస్తున్నాం. 'శ్రీశైలం' అన్నది 'పల్లెసృజన' ఇన్నోవేటర్, శ్రీకాళహస్తికి చెందిన చంద్రశేఖర్ గారు కనిపెట్టిన ఆయుర్వేద ఔషధం. మీ సలహాలు పాటించటానికి తప్పకుండా ప్రయత్నిస్తాం. భవిష్యత్తులో కూడా మీరు మా తోడుగా వుంటూ 'పల్లెసృజన' ప్రచురించే జ్ఞానానికి వన్నె తెస్తారని, పదిమందికి అర్థమయ్యేలా చేస్తారని ఆశిస్తూ నమస్సులతో....

**– ఎడిటర్.**

బ్రిగేడియర్ గణేశం గార్కి,

నమస్కారములు. రంగారెడ్డి జిల్లాలో ఒక రైతు సైకిల్‌తో తయారు చేసిన పరికరంతో వ్యవసాయంలో అంతర సేద్యం, కలుపు నివారణ చేసుకుంటున్నాడు. ఆ వివరాలు మీకు పంపుతున్నాను. దయచేసి ప్రచురించ గలరు. అలాగే నాకూ మరో సహాయం అందించగలరు. అదేమిటంటే ..... గాలి సహాయంతో పనిచేసే చేతిపంపును అస్సాంలో తయారు చేశారు. వారి చిరునామా మాకు పంపగలరని ఆశిస్తాను. **–యాగంటి శ్రీనివాసరావు,** విజయవాడ.

మీరు పంపిన వివరాలకు మా కృతజ్ఞతలు. ఈ సంచికలోనే వీటిని ప్రచురిస్తున్నాము. ఇలాంటి పల్లెజ్ఞానం రైతులకు అందించి వారి అభ్యున్నతికి పాటు పడటమే 'పల్లెసృజన' ధ్యేయం. మీకు కావలసిన సమాచారాన్ని మేము తప్పక అందిస్తాము. భవిష్యత్తులో కూడా 'పల్లెసృజన'ను గ్రామ ఇన్నోవేటర్లతో ఇలాగే సంధానం చేయవలసిందిగా కోరుతున్నాము.

**– ఎడిటర్.**

ఎడిటర్ గార్కి,

'పల్లెసృజన' ద్వారా మీరు చేస్తున్న కృషికి అభినందనలు. నాదొక చిన్న విన్నపము. మీరు ప్రచురిస్తున్న ఇన్నోవేషన్‌కు సంబంధించి ఆ ఇన్నోవేటర్ ఫోన్ నెంబరు కూడా ఇస్తే మేము నేరుగా వారిని కలుసుకునే సౌకర్యం ఉంటుందని భావిస్తున్నాను. **– శ్రీధర్ రెడ్డి,** జొన్నలగడ్డ, ఫోన్ : 94921 88479

శ్రీధర్ రెడ్డిగారూ, మీ అభిమానానికి కృతజ్ఞతలు. మేము ప్రతి ఇన్నోవేటర్ ఆర్టికల్‌కు వారి ఫోన్ నెంబర్లను అనుమతితో ప్రచురిస్తున్నాము. మా వెబ్‌సైట్ www.pallesrujana.org లో కూడా ఇన్నోవేటర్ల ఫోన్ నెంబర్లు లభ్యమవుతాయి. అంతే కాకుండా పల్లెసృజన జనవరి–ఫిబ్రవరి 2012 సంచికలో ఆంధ్రప్రదేశ్‌లో మేము వెతికి వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేటర్ల ఫోన్ నెంబర్లు, వారి ఇన్నోవేషన్లు ప్రచురించాము, దయచేసి చూడండి. **– ఎడిటర్**



## FORM IV

**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**

1. Place of publication : Ranga Reddy Dist
2. Periodicity of its publication : Bi-Monthly
3. Printer's Name : Narendra Grafix
   Nationality : Indian
   Address : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020.
4. Publisher's Name : P. Ganesham
   Nationality : Indian
   Address : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P.
5. Editor's Name : P. Ganesham
   Nationality : Indian
   Address : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad.
6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. : N.A.

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher

## రైతులకు పనికి వచ్చే 'పల్లె ప్రయోగాలు'

# తక్కువ ఖర్చుతో అడవిపందుల నివారణ



మన రాష్ట్రంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను నాశనం చేస్తున్న అడవి పందులను రైతులు చాలా స్వల్ప ఖర్చుతోనే తరిమి కొట్టవచ్చు. అడవి పందులను పారద్రోలేందుకు దీపావళి సామాగ్రి తయారు చేసేందుకు వినియోగించే 'గంధకం' పొడిని, ఆముదాన్ని కలిపి ఆ మిశ్రమాన్ని పురికొస (సుతిలి)కి రాయాలి. ఈ తాడు పొలానికి నాలుగువైపులా కట్టాలి. అడవి పంది దూరంనుంచే ఈ వాసనకు తల్లడిల్లిపోతుంది. అక్కడ వేరే పందిని వధించినట్లుగా ఈ వాసనను ఆ పంది అనుమానించి వెంటనే అక్కడినుండి నిష్క్రమిస్తుంది. మహారాష్ట్రలో కొన్నిచోట్ల ఈ ప్రయోగాన్ని ఆచరించి మంచి ఫలితాలను సాధించినట్లు పల్లెసృజనకు కొంతమంది రైతులు తెలియజేశారు.

# వరి పంటలో 'తెల్లపురుగు' నాశనకారి కొడిశె

'రైస్ హిస్పా' (తెల్లపురుగు) అనే వ్యాధి వరిపంటను నాశనం చేస్తుంది. ఈ వ్యాధివల్ల ఆసియా ఖండపు దక్షిణ, ఈశాన్య ప్రాంతాల్లో విపరీతమైన నష్టాలు కలుగుతుంటాయి. దీని నివారణకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 'మన్యం సీతారామ్' అనే రైతు గత 12 సంవత్సరాలుగా 'కొడిశె' చెట్టు ఆకులతో 'రైస్ హిస్పా' పై పరిశోధనలు జరిపి కొంత ఫలితాన్ని సాధించారు. సీతారామ్ తన తండ్రిగారివద్ద ఈ మొక్కల గురించి తెలుసుకున్నారు. ఆయన కొడిశె ఆకుల పసరుతో మనుష్యుల రోగాలను నయం చేసేవారట. అంతేగాక ఆ చెట్టు బెరడును ముద్దగా చేసి పెంపుడు జంతువుల గాయాలను కూడా నయం చేశారట.

కొడిశె చెట్టు ఆకుల పసరులు వాడటం వల్ల రైతులు పంటపై రసాయన మందుల ఖర్చు కూడా పెద్ద మొత్తంలో తగ్గుతుందని తెలుసుకున్నారు. శ్రీ సీతారామ్ తన రెండున్నర ఎకరాల పొలంలో వరి పంట వేసి కొడిశె చెట్టు ఆకుల రసాన్ని పిచికారి చేయటం ద్వారా మంచి లాభాలను పొందారు.

ఈ చెట్లు దాదాపు ప్రతి గ్రామంలో ఉంటాయి. పంటపై వ్యాధి మొదలైన వెంటనే పిచికారి చేసినచో ఫలితం బాగా వస్తుంది. వ్యాధి ముదిరితే మనకు నిరాశాజనకమే అని సీతారామ్ అంటున్నారు.





ఈ ప్రయోగాలు పాటించే రైతులు తాము పొందిన ఫలితాన్ని తప్పకుండా మాకు తెలియజేయగలరు. ఈ ప్రయోగాల వినియోగంలో మీరు ఏదైనా మార్పులు చేసి ఫలితాలను సాధిస్తే వివరాలు 'పల్లెసృజన'కు తెలుయజేస్తే వాటిని ప్రచురిస్తాం.

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 20/-లు మాత్రమే**


















**ఒక పుస్తకం వెల రూ. 10/-లు మాత్రమే**

హనీబీఎపి సేకరించిన మన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాలను ఒక పాకెట్ పుస్తకం లో పొందుపరచడమైనది. ఈ పుస్తకం కావలసిన వారు ఒక్కో పుస్తకానికి రూ. 10/-ల చొప్పున పంపి కావలసినన్ని పుస్తకాలను పొందగలరు.

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 150/- | 600/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 250/- | 1,000/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 375/- | 1,500/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | 650/- | 2,600/- |

పల్లెసృజన చందాదారులు కండి - పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి! చందాదారులుగా చేరాలనుకున్న వారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ. లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27118555, సెల్ : 9866001678
E-mail : honeybeeap@gmail.com **www.pallesrujana.org**

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి
మీ చిరునామాను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి, లేదా యస్.యం.యస్. లేదా ఈ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, **Syndicate Bank**, **Sainikpuri**, Secunderabad.
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655